తెలంగాణ పవర్

తెలుగు దినపత్రిక

అంతర్జాతీయ యువజన దినోత్సవం
యువతీ యువకులందరికీ శుభాకాంక్షలు
తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యువతీ యువకులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. యువత ఆలోచనలకు ప్రోత్సాహం, వారి ప్రతిభకు వేదిక, వారి ప్రయత్నాలకు అవసరమైన వనరులను అందిస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలరు. పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, వాతావరణ మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంలోని అంతరాలు వంటి సవాళ్లను అధిగమించేందుకు యువతకు అవకాశాలు, వనరులు, నైపుణ్యాలు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. యువతకు సరైన విద్య, నైపుణ్యం, క్రీడలు, ఉపాధి, నాయకత్వ అవకాశాలు కల్పించినప్పుడే బంగారు భవిష్యత్తును నిర్మించగలం. ప్రజా ప్రభుత్వం యువతకు అండగా నిలుస్తోంది. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడుతున్న పరిస్థితుల్లో బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 264 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | గురువారం, ఆగస్టు 13, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

మిల్లర్లనుంచి బకాయిలు వసూలు చేయాల్సిందే

హైదరాబాద్: మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తో కలిసి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు సంబంధించి బకాయిని వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి సీజన్లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు.

స్వయం సహాయక సంఘాల (గఱఊ) ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని



కేటాయిస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీబీ జీ రామ్ జీ లో ప్లాట్ఫాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ప్లాట్ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సూచించారు.

ఈ సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి , పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర , సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం.. ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతా : అమిత్ షా



పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో “కనిపించడం లేదు”, “పారిపోయారు” వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.

ట్రైల్స్ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించాలి

సైనిక ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్: భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు భారత ఆర్మీ సదరన్ కమాండ్ అధికారులకు తెలిపారు.

ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ పలువురు ఆర్మీ ప్రతినిధులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు.

ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి ఉన్న అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరగా



లెఫ్టినెంట్ జనరల్ సుముఖత వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్లకు ముందస్తుగా తెలంగాణలోని ఆయా జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తామని తెలిపారు.

దేశంలో విపత్తుల సమయంలో ఆర్మీ పోషిస్తున్న పాత్రను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తానని రాజేష్ పుష్కర్ చెప్పారు.

కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా చారిత్రక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవాన్ని తేవాలన్న పట్టుదలతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టడంపై లెఫ్టినెంట్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి మూసీ నది ప్రక్షాళన అవసరమని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు , ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు ఉదయ్ నాగరాజు సన్మానం

పాల్గొన్న హరీష్ రావు



సిద్దిపేట: బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ కు ఎన్నికైన సిద్దిపేట ముద్దుబిడ్డ ఉదయ్ నాగరాజు రి పౌర సన్మాన కార్యక్రమం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయ్ నాగరాజు కి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఉదయ్ నాగరాజు తన పేరుకు తగ్గట్లే సార్థకత తీసుకొచ్చారు, తెలంగాణలో ఉదయించి బ్రిటన్లో వెలుగొందుతున్నారు.మన రెండు తెలుగు రాష్ట్రాల నుండి బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తి ఉదయ్ నాగరాజని కొనియాడారు. ఎంతో కృషి పట్టుదల ఉంటే తప్ప అంత ఉన్నతమైన పదవి రాలేదు. ఉదయ్ ది నాది రెండున్నర దశాబ్దాల పరిచయం. ఆయన పెళ్ళికి కూడా హాజరయ్యాను. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా లండన్ నుండి ఉద్యమానికి మద్దతిచ్చారు. మనం ఎట్లా అయితే ఇక్కడ పోరాడామే ఆయన కూడా తన భాగస్వామ్యం అందించారని గుర్తు చేసుకున్నారు.

ఉదయ్ నాగరాజు బ్రిటన్ లో మరింత ఉన్నతమైన పదవులు పొందాలని, అక్కడి ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరుకుంటున్నాను. ఉదయ్ నాగరాజు ఎంత దూరం వెళ్ళినా మన ఆచారాలను, సంప్రదాయాలను పాటించడం సంతోషంగా ఉంది. ఉదయ్ నాగరాజు కి సన్మానం చేయడం అంటే సిద్దిపేట ప్రజలకు, తెలంగాణకే కాకుండా యావత్ భారతీయులకు గర్వకారణం. పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం అనేది ఉదయ్ ని చూస్తే తెలుస్తోంది, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి. ఉదయ్ నుండి యువత నేర్చుకోవాలి. చిన్న పల్లెటూరులో పుట్టి బ్రిటన్ పార్లమెంటు కు ఎన్నికయ్యారు. ఆయన కృషి, పట్టుదల, సేవలు ఆయనకు ఇంత ఉన్నతమైన స్థానం అందించాయి. ప్రతి మనిషిలో కూడా సామర్థ్యం ఉంటుంది. వాటిని వెలికితీసి కష్టపడి విజయం సాధించాలని అన్నారు.

వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్‌కు అనుమతులివ్వండి..

కేంద్ర మంత్రిని కోరిన కాంగ్రెస్ ఎంపీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కాంగ్రెస్ ఎంపీలు భేటీ అయ్యారు. తెలంగాణలో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు వికారాబాద్-కృష్ణా కొత్త రైల్వే లైన్‌కు త్వరితగతిన అనుమతులు ఇచ్చి, పనులను వేగవంతం చేయాలని కోరారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్, ?డోర్నకల్ - గద్వాల్ (కల్వకుర్తి మీదుగా) రైల్వే లైన్, ?కల్వకుర్తి - మాచర్ల రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీలు విజ్ఞప్తి చేశారు.అలాగే, హైదరాబాద్ - అమరావతి - బందర్ పోర్ట్ సరకు రవాణా(ఫ్రైట్) కారిడార్, హైదరాబాద్‌ను పుణే-ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలతో అనుసంధానించే 3 హైస్పీడ్ రైల్ కారిడార్లు, హైదరాబాద్ రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్ట్ ఫ్రైట్ ఉ హైస్పీడ్ కారిడార్లు ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా కాచిగూడ - జగ్గయ్యపేట, పటాన్‌చెరు - ఆదిలాబాద్, బోధన్ - లాతూర్ ప్రాజెక్టుల డీపీఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీలు వినతిపత్రం అందజేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మల్లు రవి, కిరణ్ కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, వంశీ గడ్డం, తదితరులు ఉన్నారు.

చెన్నై బుల్లెట్ రైలు కారిడార్లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని చేర్చాలి

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరిన ఎంపి చామల

న్యూఢిల్లీ: బుధవారం నాడు న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసారు. హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు కారిడార్లో నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని చేర్చే విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసారు.

గ్రీన్ ఫీల్డ్ అలైన్మెంట్కు బదులుగా ఇప్పటికే ఉన్న ఎన్హెచ్-65 (ఔఊ-65) కారిడార్ గుండా ఈ మార్గాన్ని నిర్మిస్తే, ఆ ప్రాంతంలోని పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు మరియు ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు.

ఈ విధంగా మార్గాన్ని మళ్లించడం ద్వారా భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా పూర్తి ప్రయోజనాలు చేకూరుతాయని కోరడం జరిగింది. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయనను



అభ్యర్థించారు.

ఈ సమావేశంలో ఎంపి చామల పాటు నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

గురువారం, ఆగస్టు 13, 2026

వాయిదాల లోక్‌సభ ? ఎవరికి ఉపయోగం?

ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే నవాలుగా మారుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి.ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అనలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే-47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది. రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు.ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సోరెన్ ప్రభుత్వం లాఠీచార్జీ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు.పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతివక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరసనలో ప్రదర్శించారు.పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య నమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది.ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు.

- ఎడిటర్

ఎంపీ వద్దిరాజు కేరళ రాష్ట్రం పేరును "కేరళం"గా మార్చడానికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది

భాష, సంస్కృతి, చారిత్రక గుర్తింపును ప్రతిబింబించేలా రాష్ట్రం పేరు మార్పు: ఎంపీ వద్దిరాజు

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు బీఆర్ఎస్ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు.కేరళ రాష్ట్రం పేరు మార్పు బిల్లు--2026పై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రాష్ట్ర ప్రజలకు అభినందనలు తెలిపారు.

మలయాళం మాట్లాడే ప్రజల భాషా, సాంస్కృతిక, చారిత్రక గుర్తింపును ప్రతిబింబించేలా 'కేరళం' అనే పేరును అధికారికంగా గుర్తించాలనే ప్రతిపాదన అభినందనీయమని రవిచంద్ర అన్నారు. కేరళ శాసనసభ ఆమోదించిన తీర్మానం నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 3కు అనుగుణంగా మొదటి షెడ్యూల్‌లో మార్పు చేసేందుకు ఈ బిల్లు తీసుకువచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రాల పేర్లు కేవలం భౌగోళిక గుర్తింపులు మాత్రమే కాదని,అవి ఆయా ప్రాంతాల వారసత్వం, భాష, సంస్కృతి, ప్రజల సామూహిక గుర్తింపును ప్రతిబింబిస్తాయన్నారు. రాష్ట్రాల ఆకాంక్షలను



గౌరవించడం అంటే భారత సమాఖ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమేనని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.

కేరళతో తనకున్న అనుబంధాన్ని కూడా రవిచంద్ర సభలో ప్రస్తావించారు. శబరిమల అయ్యప్ప స్వామి ఆలయాన్ని తెలంగాణతో పాటు తమిళనాడు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు సందర్శిస్తారని తెలిపారు. భక్తులు 41 రోజుల పాటు దీక్ష తీసుకుని శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయమని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

కేరళలోని శ్రీఅనంత పద్మనాభ స్వామి గురువాయూర్ ఆలయాలు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు అలప్పుజ, మున్నార్ వంటి పర్యాటక ప్రాంతాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని ఎంపీ వద్దిరాజు వివరించారు. కేరళ ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం, పర్యాటకం, సంస్కృతి వంటి రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు.

తెలంగాణలో కూడా కేరళకు చెందిన అనేక మంది ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా కేరళకు చెందిన నర్సులు వైద్యారోగ్య రంగంలో విశ్వసనీయమైన సేవలందిస్తున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

కేరళ సంప్రదాయ సంగీతం, కళలు, వాద్య పరికరాలకు కూడా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కేరళ కళాకారులు, సంగీత సంప్రదాయాల ప్రభావం కనిపిస్తోందని పేర్కొన్నారు.

భాష, సంస్కృతి, చరిత్రకు అనుగుణంగా రాష్ట్రాల పేర్లను గౌరవించడం దేశ సమైక్యతకు విఘాతం కాదని, భిన్నత్వంలో ఏకత్వాన్ని మరింత బలపరుస్తుందని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు.

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు బీఆర్ఎస్ తరఫున మద్దతిస్తూ,ఈ చారిత్రక సందర్భంలో ఎంపీ వద్దిరాజు ఆ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2026 – సెలబ్రేటింగ్ ఎక్సలెన్స్ ఇన్ తెలంగాణ

హైదరాబాద్, 12 ఆగస్టు 2026: రౌండ్ టేబుల్ ఇండియా తెలంగాణలోని వివిధ రంగాలలో విశేషంగా రాణించిన అచీవర్స్ మరియు ఎమర్జింగ్ వ్యక్తులను సన్మానించేందుకు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ యొక్క 7వ ఎడిషన్‌ను గర్వంగా ప్రకటిస్తోంది. ఈ అవార్డులు మన సమాజ అభివృద్ధికి గణనీయంగా దోహదపడిన వ్యక్తులను మరియు సంస్థలను గౌరవిస్తుంది.

2026 అవార్డుల విభాగాలు:

ఈ సంవత్సరం, అవార్డులు 15 విభాగాలలో ఇవ్వబడతాయి: కళలు మరియు సంస్కృతి, ఎన్జీవో, స్టార్ ఉమన్, స్టార్ కిడ్, వినోదం, విద్య, స్టార్ట్-అప్, హెల్త్ కేర్, ఫుడ్ అండ్ బేవరేజెస్, రిటైల్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇన్ఫ్లుయెన్సర్ , సస్టైనబిలిటీ ఎక్సెలెన్స్ , పరిపాలన సేవలు మరియు క్రీడలు. పైన పేర్కొన్న రంగాలలో విజయం పొంది మరియు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక అచీవర్ మరియు ఒక ఎమర్జింగ్ వ్యక్తిని సన్మానిస్తారు.

నామినేషన్ మరియు ఓటింగ్ ప్రక్రియ:

గత ఎడిషన్ 2000 నామినేషన్లు మరియు 1,50,000 పబ్లిక్ ఓట్లతో విజయవంతమైన చరిత్రను సాధించిన తరువాత, ఈ సంవత్సరపు నామినేషన్ల కోసం 13 ఆగస్టు నుండి 27 ఆగస్టు 2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2026 జ్యూరీ:

ఈ సంవత్సరం అవార్డుల ప్రదానం చెయ్యడం కోసం గౌరవనీయమైన జ్యూరీ సభ్యుల ప్యానెల్ను కలిగి ఉండడం మాకు గర్వకారణం:

లక్ష్మీ నంబియార్, స్థాపకులు, సృష్టి ఆర్ట్ గ్యాలరీ

ముజ్తబా హసన్ అస్కరీ, వ్యవస్థాపకులు,మేనేజింగ్ ట్రస్టీ,హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్.

పి.రఘురామ్, స్థాపకులు, కిమ్స్-ఉషాలక్ష్మి హాస్పిటల్

రాజ్ కందుకూరి, జాతీయ అవార్డు గ్రహీత,సినీ నిర్మాత, దర్శకులు మరియు పంపిణీదారు.

ఎం. వి. రమణ, ముఖ్య కార్యనిర్వహణాధికారి, డా. రెడ్డీస్ ల్యాబ్స్.

రమేష్ కాజ, కంట్రీ హెడ్- ఇండియా, ఎల్. పి. ఎల్. ఫైనాన్షియల్ హైదరాబాద్.

సందీప్ సుల్తానియ, ఆర్థిక కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వం.

షాహ్ అజీమ్ హమీద్, ముఖ్య కార్యనిర్వహణాధికారి,



ఫెయిర్మౌంట్ బిల్డర్స్.

శ్రీవిద్య రెడ్డి గుణంపల్లి, ఉపాధ్యక్షులు, జి. ఎన్. ఐ. టి. ఎస్.

శ్రీనివాస రావు మహంకాళి, అడ్జంట్ ప్రొఫెసర్, ఎ. ఎస్. సి. ఐ. అడ్వైసర్: ఐ.ఐ.ఎల్.ఎం ఢిల్లీ, ఎస్ ఐ యు, తిరుపతి

పోసీడెక్స్ టెక్నాలజీస్, హైదరాబాద్ అభైరో క్యాపిటల్ బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రిప్రెన్యూర్షిప్.

మా స్పాన్సర్లు:

మా ప్రధాన స్పాన్సర్లకు మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము- టైటిల్ స్పాన్సర్: ఫెయిర్మౌంట్ బిల్డర్స్, పవర్డ్ - బై స్పాన్సర్: ఎస్ ఎ ఎస్ ఇన్ఫ్రా , కో - స్పాన్సర్లు : నీమన్స్, శ్రీ జగదాంబ పర్ల్స్, బిగ్ ఎఫ్ఎమ్, నోవాటెల్, మినార్ ఆటా.

రౌండ్ టేబుల్ ఇండియా - విద్య పట్ల నిబద్ధత:

రౌండ్ టేబుల్ ఇండియా 2025 ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుల ద్వారా నిధులు సమకూర్చి 4 కొత్త స్కూల్ బ్లాక్లను తెలంగాణలో ప్రారంభించింది, అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి:

MPPS మేకగూడలో 6 తరగతి గదులు

MPPS మౌలాలి లో 3 తరగతి గదులు

MPPS అల్వాల్ లో 2 తరగతి గదులు

MPPS నర్సాపూర్ లో 4 తరగతి గదులు

రౌండ్ టేబుల్ ఇండియా 1997 నుండి 4,108 పాఠశాలలలో 10,668 తరగతి గదులను నిర్మాణం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమం 11.70 మిలియన్ పిల్లల విద్యకు దోహదపడుతోంది.

గ్రాండ్ అవార్డ్స్ నైట్:

రౌండ్ టేబుల్ ఇండియా అవార్డుల వేడుక 03 అక్టోబర్ 2026న షెడ్యూల్ చేయబడింది. ఈ వేడుక తెలంగాణ రాష్ట్రము యొక్క ప్రతిభను సన్మానించే మరియు గుర్తించే వేడుక.

రౌండ్ టేబుల్ ఇండియా గురించిన పరిచయం:

1927లో ఇంగ్లాండ్లోని నార్విచ్లో స్థాపించబడిన రౌండ్ టేబుల్, 52 దేశాలలో 43,000 కంటే ఎక్కువ మంది సభ్యులతో ఒక గ్లోబల్ఫ్రెండ్షిప్ ఆర్గనైజేషన్గా వృద్ధి చెందింది. భారతదేశంలో, 1957 నుండి రౌండ్ టేబుల్ యాక్టివ్గా ఉంది, 320 కంటే ఎక్కువ టేబుల్స్ మరియు 4,600o సభ్యులతో జీరో- ఓవర్హెడ్ పాలసీకి పేరుగాంచింది. సేకరించిన అన్ని నిధులు దాతృత్వ లక్ష్యాల కోసం, ప్రత్యేకించి వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలల నిర్మాణంపై వెచ్చించేలా =× దృష్టి సారిస్తుంది.

అరుణాచల్‌లోకి అక్రమంగా చైనా బలగాలు

డ్రాగన్‌కు భారత్ వార్నింగ్

ఇటానగర్, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు తరుచూ కొత్త పేర్లు సూచిస్తూ.. కవ్వింపులకు పాల్పడుతోంది పొరుగు దేశం చైనా. ఇటీవల చైనాకు గట్టి కౌంటర్ ఇస్తూ 27 ప్రాంతాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. దీనిపై డ్రాగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇది చట్టవిరుద్ధమని వాదిస్తోంది. అయితే, ఈ వాదనలను భారత్ తిప్పికొట్టింది. అరుణాచల్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని పునరుద్ఘాటించింది. అంతేకాదు, సరిహద్దుల్లో పరిస్థితులనే ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తును నిర్ణయిస్తాయని భారత్ స్పష్టం చేసింది.ఈశాన్య సరిహద్దుల్లోని అరుణాచల్ ప్రదేశ్ అప్పర్ సుబాన్సిరి జిల్లాలోకి చైనా దళాలు అక్రమంగా చొరబడ్డాయనే నివేదికలపై భారత్ తీవ్రంగా స్పందించింది. సరిహద్దుల్లో నెలకొనే పరిస్థితులే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఈ మేరకు భారత విదేశాంగ స్పష్టం చేసింది. స్థానికులను ఉటంకిస్తూ ఇటీవల వచ్చిన కథనాల ప్రకారం... చైనా బలగాలు వాస్తవాధీన రేఖను దాటి టాక్సింగ్ సర్కిల్‌లోని పుకార్ లా, ఒల్లాలోకి ప్రవేశించినట్టు వార్తలు వెలువడ్డాయి. నివేదికలపై అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండూ గతవారం మాట్లాడుతూ.. ప్రచారాన్ని ఖండించారు. అంతేకాదు, ఆర్మీ, స్థానిక సంస్థలతో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకుంటానని అన్నారు.భారత భూభాగాన్ని మన సైన్యం ఎంతో సమర్థవంతంగా పరిరక్షిస్తోందని, కాబట్టి ఎలాంటి చొరబాటు జరగలేదని భావిస్తున్నానని పెమా ఖండూ అన్నారు. అయితే, మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్‌ను దీనిపై ప్రశ్నించగా.. సరిహద్దుల్లో శాంతిభద్రతలను కాపాడటమే అత్యంత కీలమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఇటీవల సరిహద్దు అంశంపై జరిగిన దౌత్యపరమైన చర్చల వివరాలను ఆయన వెల్లడించారు."భారత్-చైనా సరిహద్దుకు సంబంధించిన సమస్యను ఎప్పుడూ అత్యంత తీవ్రమైనవిగా పరిగణిస్తాం... ఈ విషయాన్ని చైనా పక్షంతో జరిగిన చర్చల్లోనూ స్పష్టం చేశాం.. అక్కడ శాంతి, ప్రశాంతత నెలకొనడం అత్యంత ముఖ్యం.. సరిహద్దుల్లోని పరిస్థితులే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని ప్రతిబింబిస్తాయని మేము తెగేసి చెప్పాం" అని జైస్వాల్ అన్నారు."ఇటీవల ఆగస్టు 6 జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ మెకానిజం 36వ సమావేశంలో కూడా ఈ విషయాన్ని పునరుద్ఘాటించాం.... ఈ సమావేశంలో ఇరువర్గాలు వాస్తవాధీన రేఖ వెంబడి ఉన్న పరిస్థితిని సమీక్షించాయి. ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర అభివృద్ధికి సరిహద్దు ప్రాంతాలలో శాంతిభద్రతలను కాపాడటం అత్యవసరమని భారత పక్షం మరోసారి నొక్కిచెప్పింది" అని ఆయన పేర్కొన్నారు.సరిహద్దుల్లో ఎలాంటి అపోహలు, అపార్థాలకు తావులేకుండా డబ్ల్యూఎంసీసీ స్థానిక కమాండర్ స్థాయి సమావేశాలతో పాటు దౌత్య, సైనిక మార్గాలను ఉపయోగించుకోవడానికి ఇరుదేశాలు అంగీకరించాయని రణధీర్ జైస్వాల్ చెప్పారు.భారత్‌లో విడదీయరాని భాగంఅరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా పేర్లు పెట్టే ప్రయత్నాలను తిప్పికొడుతూ గత వారం భారత్ 27 ప్రాంతాలకు భారత అధికారిక మ్యాప్‌లో ప్రామాణిక పేర్లను సూచించింది. భారత్ తీసుకున్న ఈ నిర్ణయంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. అరుణాచల్ ప్రదేశ్‌ను తాము గుర్తించబోమని వ్యాఖ్యానించింది. "చైనా కాలక్రమేణా ఉపయోగిస్తున్న పేర్లను భారత్ తన సొంత పేర్లతో మార్చడానికి ప్రయత్నించడం చట్టవిరుద్ధం.. చెల్లబాటు కూడా కావు" అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ అన్నారు.చైనా చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో విడదీయరాని భాగమని విదేశాంగ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పష్టమైన సందేశాన్నిచ్చారు.

ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి

హైదరాబాద్, ఆగస్టు 12,(న్యూస్ పల్స్)తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ-జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది.

రసవత్తరంగా ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ డ్రామా..

హైదరాబాద్, ఆగస్టు 12,(న్యూస్ పల్స్)రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు.అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది.మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

స్వాతంత్ర్య దినోత్సవానికి రెడ్ ఫోర్ట్ సిద్ధం



న్యూఢిల్లీ, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)17వ శతాబ్దంలో వర్తకం కోసం ఇండియాకు వచ్చిన ఆంగ్లేయులు.. తర్వాత నాటి దేశంలోని అనైక్యతను ఆసరాగా తీసుకుని చివరకు అధికారం చేజిక్కించుకుని పెత్తనం చెలాయించారు. దాదాపు 200 సంవత్సరాల పాటు సాగిన బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి. చివరకు 1947లో భరతమాతకు విదేశీ పాలన నుంచి విముక్తి లభించింది. ఆ ఏడాది 15న స్వాతంత్ర్యం లభించింది. అప్పటి నుంచి ఏటా ఆగస్టు 15న భారతావని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటోంది. భారతదేశం మరో నాలుగు రోజుల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. అయితే ఈ వేడుక సమీపిస్తున్న తరుణంలో ఒక ప్రశ్న తరచుగా వేధిస్తుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం 79వదా లేక 80వదా?. భారతదేశం స్వాతంత్ర్య పొంది ఎన్ని సంవత్సరాలు గడిచాయి? లేదా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంఖ్య ఎంత? అనే దానిపై ఈ సమాధానం ఆధారపడి ఉంటుంది. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అందువల్ల 2026 ఆగస్టు 15 నాటికి దేశం 79 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పూర్తి చేసుకుంటుంది. కానీ, 2026 ఆగస్టు 15 భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సూచిస్తుంది.

79 లేదా 80వ వేడుకనా?

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించింది. కాబట్టి 2026 ఆగస్టు 15 నాటికి 79 ఏళ్లు పూర్తవుతాయి. అంటే, 2026 – 1947 = 79 సంవత్సరాలు. అదే సమయంలో మొదటి స్వాతంత్ర్య దినోత్సవాన్ని 1947లోనే జరుపుకున్నాం. ఆ వేడుకను మొదటి స్వాతంత్ర్య దినోత్సవం అనుకుంటే 2026 నాటికి ఇది 80వ వేడుక అవుతుంది. కాబట్టి, వేటిని పరిగణనలోకి తీసుకుంటున్నారనే దానిబట్టి ఈ రెండు పదాలు సరైనవే కావచ్చు. ఎందుకంటే 2026 నాటికి 79 వ స్వాతంత్ర్యం పూర్తవుతుంది. 2026 ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆగస్టు 15, 1947 భారత మొదటి స్వాతంత్ర్య దినోత్సవం.

ఈ ఏడాది 80వ స్వాతంత్ర్య దినోత్సవమా?

వార్షికోత్సవానికి, సంఖ్యతో కూడిన వేడుకకు మధ్య ఉండే వ్యత్యాసమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, దేశం తన తొలి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంది. ఆ తర్వాత సంవత్సరం రెండోది. ప్రతి ఆగస్టు 15న ఈ లెక్కింపు కొనసాగింది.

1947 – మొదటి స్వాతంత్ర్య దినోత్సవం
1948 – రెండో స్వాతంత్ర్య దినోత్సవం
1949 – మూడో స్వాతంత్ర్య దినోత్సవం
2025 – 79వ స్వాతంత్ర్య దినోత్సవం
2026 – 80వ స్వాతంత్ర్య దినోత్సవం

కాబట్టి దేశానికి స్వాతంత్ర్య వచ్చి 79 ఏళ్లు పూర్తయినప్పటికీ, 2026 ఆగస్టు 15 భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం కావడానికి ఇదే కారణం.భారత్ 2026లోనే తన 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 79 వసంతాలు పూర్తి చేసుకుంటుంది. భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చి ఎన్ని సంవత్సరాలైంది అని అడిగితే సమాధానం 79 ఏళ్లు. భారతదేశం ఎన్నో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది అని అడిగితే, సమాధానం 80వ స్వాతంత్ర్య దినోత్సవం.

స్వాతంత్ర్య దినోత్సవం 2026 వేడుకలు

దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలన నుంచి దేశానికి 1947 ఆగస్టు 15న విముక్తి లభించడంతో ఏటా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా జెండా వందన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర వేడుకలతో దీనిని నిర్వహిస్తారు. ప్రధాన జాతీయ వేడుక న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరుగుతుంది. అక్కడ ప్రధాన మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు

172 దేశాలకు ఈ-వీసా వ్యవస్థ!

న్యూఢిల్లీ, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)భారత్‌ను సందర్శించే అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రముఖ అట్టారీ ల్యాండ్ పోర్టుతో పాటు మరో 10 అంతర్జాతీయ కేంద్రాలోకి ఈ-వీసా హోల్డర్లకు ప్రవేశాన్ని కల్పిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నూతన నోటిఫికేషన్ విడుదల చేసింది. తొమ్మిది ల్యాండ్ పోర్టులు, రెండు విమానాశ్రయాలను ఈ జాబితాలో చేర్చడంతో.. దేశవ్యాప్తంగా ఈ-వీసా ద్వారా భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉన్న అంతర్జాతీయ కేంద్రాల సంఖ్య ఏకంగా 88కి చేరింది.కేంద్రం తాజాగా విడుదల చేసిన సవరించిన నిబంధనల ప్రకారం.. విదేశీ ప్రయాణికులకు ప్రవేశం కల్పించే మొత్తం 88 కేంద్రాలలో 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 ల్యాండ్ పోర్టులు ఉన్నాయి. అయితే కొత్తగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం తిరుపతి విమానాశ్రయాలను కొత్తగా ఈ-వీసా జాబితాలో చేర్చారు. అలాగే కొత్తగా పంజాబ్‌లోని అట్టారీతో పాటు రక్సాల్, రూపైడిహా, జోగ్బానీలతో పాటు దర్రంగా, గెడే, ఘోజాదంగా, హరిదాస్‌పూర్, జైగావ్, డాప్కీ, మోరే సరిహద్దు ప్రాంతాలను ఈ-వీసా చెక్‌పోస్టులుగా గుర్తించారు.విదేశీయులకు ఈ-వీసా నిబంధనలను ఎంతగా సడలించినప్పటికీ.. పాకిస్థానీ పాస్‌పోర్టు కలిగిన వ్యక్తులకు లేదా పాకిస్థానీ మూలాలు ఉన్న ప్రయాణికులకు భారత్ ఎలాంటి ఈ-వీసాలను మంజూరు చేయడం లేదు. అలాంటివారు సాధారణ పద్ధతిలోనే విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు లేదా కాన్సులేట్ ద్వారా నేరుగా రెగ్యులర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఈ-పోర్టల్ స్పష్టం చేసింది.భారత వీసా నిబంధనలను సులభతరం చేస్తూ 2014లో కేవలం 43 దేశాల పౌరుల కోసం ప్రారంభించిన ఈ-వీసా సేవలు.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చాయి. టూరిస్ట్, బిజినెస్, మెడికల్, స్టూడెంట్, గ్రూప్ ట్రావెల్, క్రూయిజ్, ట్రాన్సిట్, పర్వతారోహణతో సహా మొత్తం 17 వేర్వేరు సబ్-కేటగిరీలకు ఈ-వీసా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ-వీసాల కోసం దాఖలయ్యే దరఖాస్తుల్లో దాదాపు 95 శాతానికి పైగా అప్లికేషన్లను కేవలం 72 గంటల వ్యవధిలోనే ప్రాసెస్ చేసి అధికారులు క్లియరెన్స్ ఇస్తున్నారు.

ఈ కేవైసీ కోసం ఆగస్టు 31లోపు డెడ్ లైన్.

హైదరాబాద్, ఆగస్టు 12,(న్యూస్ పల్స్)దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. అయితే ఈ కేవైసీ కోసం ప్రత్యేకంగా కేంద్రాలకు వెళ్లకుండా ఇంట్లోనే మొబైల్ ద్వారా కూడా పూర్తి చేయొచ్చు. గ్యాస్ కనెక్షన్లు నిజమైన లబ్ధిదారుల పేర్లలోనే కొనసాగుతున్నాయా..? లేదా అనే విషయాన్ని నిర్ధారించడం కోసమే ఈ ఈ కేవైసీ. ఒకే వ్యక్తి పేరుతో ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు ఉండటం.. తప్పుడు వివరాలతో కనెక్షన్లు తీసుకోవడం వంటి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ ధ్రువీకరణను చేపడుతున్నాయి. దీంతో అర్హులైన వినియోగదారులకే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ కేవైసీ పూర్తి చేయడానికి గ్యాస్ ఏజెన్సీకి వెళ్లాలంటే కొందరికి ఇబ్బందులు ఉంటాయి. దీంతో ఆ అవసరం లేకుండా ఇంటి నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా దీనిని పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం మీరు ఏ కంపెనీ గ్యాస్ కనెక్షన్ ఉపయోగిస్తున్నారో దానికి అనుగుణంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా ఆ కంపెనీ వెబ్ సైట్ నుంచి కూడా ఈ ప్రక్రియను చేయొచ్చు.ముందుగా గ్యాస్ కంపెనీ యాప్ డౌన్ లోడ్ చేసుకున్న తరువాత రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అనంతరం ప్రొఫైల్ లేదా మై అకౌంట్ విభాగంలోకి వెళ్లి 'ఈకేవైసీ లేదా రీ వెరిఫికేషన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు కోసం ఆధార్ ఫేస్ ఆర్ డీ యాప్ ఓపెన్ అవుతుంది. ముఖంపై సరిపడా వెలుతురు ఉండేలా చూసుకుని కెమెరా ద్వారా ఫేస్ స్కాన్ పూర్తి చేయాలి. ధ్రువీకరణ విజయవంతమైతే ఈ కేవైసీ పూర్తయినట్లు స్క్రీన్‌పై సమాచారం కనిపించడంతో పాటు కన్ఫర్మేషన్ మెసేజ్ కూడా వస్తుంది ఫేస్ స్కాన్ చేసే సమయంలో ముఖం స్పష్టంగా కనిపించేలా ఉండాలి. కళ్లద్దాలు, మాస్క్, టోపీ వంటివి తొలగించడం మంచిది. ఇంటర్నెట్ కనెక్షన్ బాగా ఉండాలి. అలాగే ఆధార్‌లో నమోదైన వ్యక్తే స్కాన్ చేయాలి. లేదంటే ధృవీకరణ విఫలమయ్యే అవకాశం ఉంటుంది. చాలా మంది ఒకేసారి ఈ కేవైసీ చేయడానికి ప్రయత్నిస్తే సర్వర్‌పై ఒత్తిడి పెరిగి యాప్ నెమ్మదిగా పనిచేసే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం తొందరగా లేదా రాత్రి సమయంలో ఈ కేవైసీ ప్రయత్నిస్తే ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వినియోగదారులు చెబుతున్నారు.

మెయినాబాద్ లో 200 కోట్లతో పూలు, కూరగాయలు మార్కెట్

హైదరాబాద్, ఆగస్టు 12,(న్యూస్ పల్స్)హైదరాబాద్ శివారులో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్‌లో మొత్తం 39.07 ఎకరాలను మార్కెటింగ్ శాఖకు కేటాయించింది. మార్కెట్‌లో శీతల గిడ్డంగులు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్, భారీ భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంగా ఉండటం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తుల రవాణా, దేశీయ, విదేశీ ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.హైదరాబాద్ శివారులో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు, పూలు కూరగాయల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో 39.07 ఎకరాల భూమిని కేటాయించారు. మార్కెట్ నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 176/పీలో 23.22 ఎకరాలు, హిమాయత్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 151/పీలో 15.25 ఎకరాలు కలిపి మొత్తం 39.07 ఎకరాలను రెవెన్యూ శాఖ మార్కెటింగ్ శాఖకు బదలాయించింది. భూమి బదలాయింపు పూర్తవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనపై కసరత్తు ప్రారంభించారు. మార్కెట్ నిర్మాణం, విస్తీర్ణం, మౌలిక వసతులు, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలు తదితర అంశాలను డీపీఆర్‌లో పొందుపరచనున్నారు.దేశంలో పూల వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన బెంగళూరులోని కృష్ణరాజేంద్ర మార్కెట్‌ను అధికారులు ఇప్పటికే అధ్యయనం చేసినట్లు సమాచారం. అక్కడి మార్కెట్ పనితీరును పరిశీలించిన అధికారులు.. దానికంటే పెద్దదిగా, ఆధునిక సదుపాయాలతో హైదరాబాద్ మార్కెట్‌ను తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించారు. ప్రతిపాదిత మార్కెట్‌లో భారీ మార్కెట్ భవనాలు, ప్రత్యేక విక్రయ వేదికలు, లోడింగ్? అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారాలు, శీతల గిడ్డంగులు, పార్కింగ్, అంతర్గత రహదారులు, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు.అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాలకు మరో ప్రత్యేకత ఉంది. ఇవి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను వేగంగా తరలించేందుకు అనుకూలంగా ఉంటాయి. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పూలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకురావచ్చు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉండటం వల్ల నాణ్యమైన పూలు, త్వరగా పాడయ్యే కూరగాయలను దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు విదేశీ మార్కెట్లకు కూడా తరలించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం తెలంగాణలో పూలకు ప్రత్యేకంగా పెద్ద మార్కెట్ లేకపోవడంతో రైతులు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోంది. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో కూరగాయలతోపాటు పూల విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక మార్కెట్ ఏర్పాటైతే వేలం, ధర నిర్ణయం, నిల్వ, రవాణా వంటి వ్యవస్థలు ఒకే చోట అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల రైతులకు మార్కెట్ సమాచారం, మెరుగైన ధరలు లభించడంతోపాటు పంట నష్టాలు తగ్గే అవకాశం ఉంది.తెలంగాణలో ప్రస్తుతం సుమారు 4,402 ఎకరాల్లో వివిధ రకాల పూలు, 1.03 లక్షల ఎకరాల్లో కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిలో దాదాపు 60 శాతం సాగు హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లోనే జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. నగరానికి సమీపంలోనే భారీ వినియోగ మార్కెట్ ఉండటం రైతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ, తగిన మార్కెటింగ్, నిల్వ సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండలంలో ప్రతిపాదిత మార్కెట్ పూర్తయితే పూలు, కూరగాయల రైతులకు కొత్త మార్కెట్ వేదికగా మారనుంది. ఉత్పత్తిదారులు, వ్యాపారులు, హోల్‌సేల్ కొనుగోలుదారులు, ఎగుమతిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో మార్కెటింగ్ వ్యవస్థ మరింత వ్యవస్థీకృతమయ్యే అవకాశం ఉంది.

నియోపోలీస్ లో ఎకరా 120 కోట్లు...

హైదరాబాద్, ఆగస్టు 12,(న్యూస్ పల్స్)హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల సమీకరణే లక్ష్యంగా కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి సిద్ధమైంది. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా, గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఖరారు చేశారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు సాగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను కూడా ఈ-వేలంలో ఉంచారు.హైదరాబాద్ నగర పరిధిలో భూముల విక్రయాల ద్వారా భారీగా ఆదాయం సమీకరించడమే ధ్యేయంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరొక భారీ ఈ-వేలానికి శ్రీకారం చుట్టింది. అత్యంత ఖరీదైన కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లలో ఉన్న విలువైన భూములతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్లను విక్రయించడానికి అధికారులు నోటిఫికేషన్ సిద్ధం చేశారు. గతంలో డిసెంబర్ 2025లో నిర్వహించిన నియోపోలిస్ భూముల వేలంలో ఎకరానికి అత్యధికంగా రూ. 131 కోట్లు, రూ. 118 కోట్ల వరకు ధర పలికి హెచ్ఎండీఏకి సుమారు రూ. 1000 కోట్ల ఆదాయం సమకూరింది.అంతకుముందు వివిధ దశల్లో చేపట్టిన వేలం పాటల ద్వారా సుమారు రూ. 3,708 కోట్లు వచ్చాయి. గతంలో నమోదైన రికార్డు ధరలను ప్రాతిపదికగా తీసుకుంటూ.. ప్రస్తుతం నియోపోలిస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూభాగానికి కనీస ధరగా ఎకరానికి రూ. 120 కోట్లుగా నిర్ణయించారు. అలాగే గోల్డెన్ మైల్ లేఅవుట్‌లోని 0.70 ఎకరాల భూమికి ఎకరానికి రూ. 70 కోట్ల ప్రారంభ ధరను నిర్ణయించారు. ఈ ప్రధాన రెండు లేఅవుట్లకు సెప్టెంబర్ 9న ఈ-వేలం జరగనుంది.ఈ వేలం ప్రక్రియ మొత్తం ఆగస్టు 24న ప్రారంభమై సెప్టెంబర్ 9 వరకు కొనసాగనుంది. కోకాపేట్ మాత్రమే కాకుండా నగర శివారులలో ఉన్న పలు రెసిడెన్షియల్ లేఅవుట్లలో కూడా భూములను హెచ్ఎండీఏ అమ్మకానికి ఉంచింది. కూకట్‌పల్లి సమీపంలోని హైదరాబాద్ నగర్, మోకిలా, బాచుపల్లి, కొత్తూర్ సమీపంలోని ఇన్ముల్‌నర్వ లేఅవుట్లతో పాటు బైరాగిగూడ, చందానగర్, సూరారం, కాప్రా, కిష్టారెడ్డిపేట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలంలో విక్రయించనున్నారు.ఈ వేలంలో భాగంగా మోకిలా లేఅవుట్‌లోని 300 నుంచి 500 చదరపు గజాల ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ. 55 వేలు, బాచుపల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు రూ. 45 వేలుగా నిర్ణయించారు. అలాగే సూరారంలో ఉన్న 2,420 చదరపు గజాల ల్యాండ్ పార్సెల్‌కు గజానికి రూ. 75 వేలు, మరో 4,840 చదరపు గజాల ప్లాట్‌కు గజానికి రూ. 55, వేలు అప్‌సెట్ ధరగా ఖరారు చేశారు. క్లియర్ టైటిల్స్ ఉన్న ఈ ప్రభుత్వ భూముల విక్రయానికి బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన వస్తుందని అధికారులు భావిస్తున్నారు

అమ్మవారి హుండీలో 17 తులాల జర్మన్ సిల్వర్!

హైదరాబాద్, ఆగస్టు 12,(న్యూస్ పల్స్)లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు పూర్తయింది. బోనాల సందడి ముగిసిన తర్వాత చేపట్టిన లెక్కింపులో నగదుతో పాటు బంగారం, వెండి కానుకలు బయటపడ్డాయి. అయితే ఈసారి హుండీలో లభించిన 170 గ్రాముల జర్మన్ సిల్వర్ ప్రత్యేకంగా ఆకర్షించింది. ఆలయానికి 12 రోజుల వ్యవధిలో వివిధ రూపాల్లో మొత్తం రూ.9,90,726 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో హుండీల ద్వారా రూ.6,26,226 నగదు సమకూరింది. మిగిలిన ఆదాయం ఇతర కానుకలు, పూజా టికెట్లు, కొబ్బరికాయలు, శాంతి కళ్యాణం తదితరాల ద్వారా వచ్చినట్లు అధికారులు తెలిపారు.హుండీ లెక్కింపు సందర్భంగా నగదుతో పాటు 0.06 గ్రాముల బంగారం, 0.28 గ్రాముల వెండి, 170 గ్రాముల జర్మన్ సిల్వర్ లభించినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణంగా భక్తులు నగదు, బంగారం, వెండి రూపంలో మొక్కులు చెల్లిస్తుంటారు. ఈసారి జర్మన్ సిల్వర్ కూడా హుండీలో లభించడం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ జర్మన్ సిల్వర్ సాధారణ వెండి ధరతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది. తులం రూ.300 నుంచి రూ.400 మధ్య ఉంటుంది. అంటే 17 తులాలు 300 చొప్పున అనుకుంటే రూ.5100 మాత్రమే.హుండీల లెక్కింపు సమయంలో మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సీజ్ చేసిన నాలుగు హుండీలను అధికారులు తెరిచి కానుకలను లెక్కించారు. అయితే మరో హుండీ లాక్ ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో చివరకు వెల్డింగ్ మిషన్ సహాయంతో లాక్‌ను కట్ చేసి హుండీని తెరిచి లెక్కింపు పూర్తి చేశారు. లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తాజాగా హుండీల లెక్కింపు పూర్తి కావడంతో 12 రోజుల ఆలయ ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు.

రాయదుర్గంలో భూదోపిడీని అడ్డుకుంటాం : ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



రాయదుర్గంలో జరుగుతున్న ఈ భూ దోపిడీని అడ్డుకుని తీరుతాము.. దీని మీద మేము గవర్నర్, సీఐడీ, సీబీఐ దగ్గరికి పోతామని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. బుధవారం రాయదుర్గం మల్కం చెరువు ఎదురుగా నిర్మిస్తున్న పీఎం ఏక్తా యూనిటీ మాల్ నిర్మాణ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రాయదుర్గంలో రూ.1700 కోట్ల విలువైన 7 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి పీఎం ఏక్తా మాల్ నిర్మాణం పేరుతో తన బినామీ సంస్థలకు ఎలాంటి టెండర్లు లేకుండా కట్టబెట్టారని విమర్శించారు.రేవంత్ రెడ్డి ఎంత పెద్ద నేరస్థుడో ఆయనకి కొమ్ము కాస్తున్న అధికారులు కూడా అంతే నేరస్థులు. ఈ ప్రాజెక్టు కోసం గవర్నమెంట్ రూ.200 కోట్లు లోన్ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ వాళ్లకు కళ్లే కనబడటం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బినామీ కంపెనీని నడుపుతున్నది ఐఏఎస్ జయేష్ రంజన్, ఐఎఫ్ఎస్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి అని ఆరోపించారు. ఇష్టం వచ్చినట్లు దొంగ అగ్రిమెంట్లు, టెండర్లు చేసి వేల కోట్ల రూపాయలు పందికొక్కుల లాగా దోచుకుని తింటాము అంటే కర్రు కాల్చి అధికారులకు కూడా వాతలు పెడతామన్నారు.

అక్రమ ఇసుక డంపులను సీజ్ చేయాలి : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి



అర్వపల్లి, ఆగస్టు 12 : జాజిరెడ్డిగూడెంలో అక్రమంగా ఇసుక డంపు చేసిన వారిపై కేసులు నమోదు చేసి, వారి లైసెన్స్ ను రద్దు చేయాలని, అలాగే అక్రమ ఇసుక డంపులను సీజ్ చేయాలని డిప్యూటీ తాసీల్దార్ అశ్వినికి సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి కాలం అయిపోయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక క్వారీల నిర్వహణ ఉంది. పూడిక పేరుతో అక్రమ ఇసుక రవాణా చేస్తూ కాంట్రాక్టర్లు, మైనింగ్ అధికారులు, టిజి ఎం.డి.సి, అధికార పార్టీ నాయకుల కనుసైగల్లో అక్రమ ఇసుక రవాణా చేస్తూ గుట్టలు గుట్టలుగా ఇసుక డంపులు చేసి అర్ధరాత్రుల్లో అక్రమంగా ఇసుకను నడుపుతున్నారన్నారు. ఏడు టిప్పర్లకి ఒకే నెంబర్ తో నడుస్తున్న అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వ అనుమతి అయిపోయిన ఇసుక క్వారీలో జెసిపి పెట్టి అర్ధరాత్రిలో ఇసుకని తరలిస్తున్నారు. జిల్లా కలెక్టర్, టీజీఎండీసీ అధికారులు జేసీబీలతో డంపులను చేసి ఇసుక కాంట్రాక్టర్ల లైసెన్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పూడిక, ప్రాజెక్టుల పేరుతో కాసుల వేట నడుస్తుందన్నారు. ఇసుక రవాణా టీజీఎండిసి పర్యవేక్షణలో ఉండాలి కానీ ఇసుక పూడిక తీత పనులు కాంట్రాక్టర్ లు తనకు సంబంధించిన ప్రైవేటు వ్యక్తులతో టిప్పర్లతో అక్రమంగా నడుపుతున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణా చిన్న స్థాయి ప్రజాప్రతినిదుల నుండి మంత్రుల సహకారాలు పుష్కలంగా ఉన్నాయి. తక్షణమే టీజీఎండిసి, జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు బాధ్యత తీసుకుని అక్రమంగా డంపు చేసిన ఇసుక డంపును సీజ్ చేసి, దీనిలో భాగస్వాములైన మైనింగ్ అధికారులపై, టీజీ ఎండీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి సబ్ డివిజన్ కార్యదర్శి బొడ్డు శంకర్, జిల్లా నాయకులు పోలేబోయిన కిరణ్, దేషోజు మధు, ఎస్డీఎలసీ నాయకులు పోలేబోయిన పెద్ద లింగయ్య, గ్రామ కార్యదర్శి వడకల బయన్న, పోలేబోయిన మధుకర్, ధర్మాజీ, పలాస వెంకన్న పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సద్భావన యాత్రతో ట్రాఫిక్ తిప్పలు


నారాయణపేట: రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర నారాయణపేట జిల్లాకు చేరింది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా నుంచి కృష్ణ మండలం రోడ్డు మీదుగా మక్తల్ చేరుకుంది. ఈ యాత్రకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో స్థానిక నాయకులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం 12.40 గంటలకు మక్తల్ అంబేద్కర్ చౌరస్తాకు యాత్ర చేరుకుంది. మున్సిపల్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు ఏర్పాట్లు చేశారు యాత్ర కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్‌తో పాటు పడమటి ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో పూర్తిగా ట్రాఫిక్ ఏర్పడింది. అసలే అమావాస్య కావడంతో మక్తల్ లో ప్రసిద్ధి గాంచిన శ్రీ పడమటి ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. భక్తులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడ్డారు. సద్భావన యాత్రకు స్వాగతం పలికే కార్యక్రమం ప్రజలకు అసౌకర్యంగా మారడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఇండియా-చైనా మధ్య మళ్లీ ఉద్రిక్తత..

భారత, చైనా బలగాల మధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో ఘర్షణ

ఇండియా-చైనాల మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరు దేశాల సైనికులు సరిహద్దులో పరస్పరం ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దు ప్రాంతం లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) వద్ద గత నెలలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీనిపై భారత సైన్యం, ప్రభుత్వం మాత్రం అధికారికంగా స్పందించలేదు. జూలై 26న ఈ ఘటన జరిగింది. ఇండియా, చైనా బలగాలు సరిహద్దులు సాధారణ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తుండగా పరస్పరం ఎదురుపడ్డారు.అయితే, అక్కడ చైనా సైనికులు ఇంగ్లీషులో ఒక బ్యానర్ ప్రదర్శించడం ఘర్షణకు దారితీసింది. ఇలా వారం రోజులపాటు ఇరు దేశాల సైనికులు ఘర్షణకు దిగినట్లు సమాచారం. తర్వాత రెండు దేశాలకు చెందిన ఆర్మీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, పరస్పరం చర్చలు జరిపారు.



పరిస్థితి సద్దుమణిగేలా చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేనట్లు తెలుస్తోంది. గతంలో కూడా పలుమార్లు ఇరు దేశాల సైనికులు ఘర్షణకు దిగిన సంగతి తెలిసిందే. 2017లో డోక్లాం సెక్టార్‌లో ఘర్షణ జరిగింది. ఆ తర్వాత చివరిసారిగా 2020 జూన్‌లో లదాఖ్ వద్ద ఇండియా-చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తిన సంగతి తెలిసిందే. అప్పటి ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులయ్యారు. చైనా సైనికులు కూడా బోలెడంత మంది మరణించారు. కానీ, దీనిపై చైనా అధికారికంగా ప్రకటించలేదు.మళ్లీ ఆరు సంవత్సరాల తర్వాత రెండు దేశాల మధ్య ఘర్షణ తలెత్తింది. మరోవైపు చైనా ఇటీవలి కాలంలో ఇండియాను రెచ్చగొట్టే చర్యలకు దిగుతోంది. అరుణాచల్ ప్రదేశ్‌ను తన భూభాగంగా పేర్కొంటూ చైనా మ్యాప్ కూడా రూపొందించింది. అంతేకాదు.. ఇక్కడి ప్రదేశాలకు కొత్త పేర్లు పెట్టింది. కానీ, ఇండియా వీటిని ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ ఇండియాలో భాగమే అంటూ ప్రకటించింది. రెండు రోజులక్రితం కూడా ఇండియా ఇదే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది.

మణిపూర్‌లో నాగా గ్రామంలో దుండగుల బీభత్సం.. ఇళ్లకు నిప్పు

మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలోని టోక్‌పా లియాంగ్‌మై నాగా గ్రామంలో మంగళవారం రాత్రి సాయుధ దుండగులు దాడికి పాల్పడ్డారు. రాత్రి 9.30 గంటల సమయంలో గ్రామంలోకి ప్రవేశించిన దుండగులు.. పలుమార్లు కాల్పులు జరిపి, అనంతరం ఇళ్లకు నిప్పంటించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు తొమ్మిది ఇళ్లు దగ్ధమైనట్లు వెల్లడించారు. ఎక్కువగా కచ్చా ఇళ్లు కావడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకురావడంలో స్థానికులు సహకరించారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ఆ ప్రాంతంలో అదనపు భద్రతా బలగాలను మోహరించారుఈ దాడిని లియాంగ్‌మై నాగా కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. మరో వర్గానికి చెందిన సాయుధ వ్యక్తులే ఈ దాడికి పాల్పడ్డారని కౌన్సిల్ ఆరోపించింది. దాడిలో 10 ఇళ్లు, ఒక చర్చి కూడా దగ్ధమైనట్లు పేర్కొంది. అమాయక పౌరులు, నివాస గృహాలు, ప్రార్థనా స్థలాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం తీవ్రమైన హింసాత్మక చర్యగా అభివర్ణించింది. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే గ్రామంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.



ఉద్రిక్తంగా ఇరాన్ వార్..

నౌకపై హౌతీల దాడి.. కార్గో నౌకపై అమెరికా దాడి.. ఆరుగురు మృతి

ఇరాన్-అమెరికా యుద్ధం మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఇప్పుడీ యుద్ధంలోకి హౌతీలు కూడా చొరబడ్డారు. తాజాగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో ఒక నౌకపై హౌతీలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు మరణించినట్లు యెమెన్ వెల్లడించింది. యెమెన్‌లోని ఉగ్రవాద సంస్థ హౌతీస్. ఈ సంస్థకు ఇరాన్ అండగా ఉంటుంది. అందుకే తాజా యుద్ధంలో ఇరాన్ తరఫున ఈ ఉగ్రవాదులు కూడా పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తాము మూడు మిస్సైల్స్ ప్రయోగించినట్లు యెమెన్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో, ఎర్ర సముద్రం వద్ద ఈజిప్టుకు చెందిన తిహమా అనే నౌకపై హౌతీలు మిస్సైల్ దాడి చేశారు.ఈ ఘటనలో నౌకలోని నలుగురు మరణించారు. వీరిలో ముగ్గురు పాకిస్తానీలు, ఒక ఇండోనేసియన్ ఉన్నారు. ఆ తర్వాత ఈ నౌకలోని వారిని రక్షించేందుకు మరో రెస్క్యూ నౌక వచ్చింది. అయితే, ఈ నౌకపై కూడా హౌతీలు దాడి చేశారు. ఈ ఘటనలో మరో రెస్క్యూవర్లు మరణించారు. హౌతీస్ జరిపిన దాడిలో ఇలా ఆరుగురు మరణించారు. అలాగే, ఆయుధాలతో వెళ్తున్న సౌదీ మిలిటరీ నౌకపై కూడా బాబ్ ఎల్-మాండెబ్ వద్ద దాడి చేశామని హౌతీస్ సంస్థ ప్రకటించింది. ఈ దాడిపై సౌదీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు అమెరికా కూడా ఒక కార్గో నౌకపై దాడి చేసింది. పనామాకు చెందిన ఒక కార్గో నౌకకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, దీంతో అమెరికన్ నేవీకి చెందిన ఎంహెచ్60 హెలికాప్టర్ నుంచి రెండు మిస్సైల్స్ ప్రయోగించామని అమెరికా తెలిపింది.ఈ నౌక ఇరాన్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఈ దాడి చేశామని పేర్కొంది. ఇరాన్ పోర్టులకు ఎలాంటి నౌకలు వెళ్లకుండా జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలపై నిషేధం ఉన్నప్పటికీ.. పనామా నౌక వెళ్లేందుకు ప్రయత్నించడంతో దాడి చేశామని తెలిపింది. ఇంకోపక్క.. యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ షరతులకు అంగీకరించే వరకు యుద్ధం కొనసాగుతుందని, హోర్ముజ్ జలసంధిని తెరిచేది లేదని ఇరాన్ అంటోంది. దీంతో ఇంకా వార్ కొనసాగుతోంది.



ప్రతిపక్షాలది అరాచక మనస్తత్వం: బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్

ఢిల్లీ, ఆగస్టు 12: పార్లమెంట్ సమావేశాలను వరుసగా అడ్డుకుంటూ, కీలకమైన ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా విపక్షాలు వ్యవహరిస్తున్న తీరుపై అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రతిపక్షాల ఈ ధోరణి వారి 'అరాచక మనస్తత్వాన్ని' ప్రతిబింబిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు.ప్రతిపక్షాల తీరుపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన నితిన్ నబీన్.. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతీ ముఖ్యాంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్షాలు సభను నడవనీయకుండా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రజలందరూ ఈ పరిణామాలను గమనిస్తున్నారని, చర్చల నుంచి ఎవరు పారిపోతున్నారో దేశ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు.మరోవైపు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా విపక్షాల వైఖరిని ఎండగట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎలాంటి చర్చకైనా సిద్ధంగా ఉందని, అయితే ప్రతిపక్షాలు అర్థవంతమైన చర్చలు జరపకుండా గందరగోళం సృష్టించడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. విపక్షాలకు చర్చపై నిజంగా ఆసక్తి ఉంటే లోక్‌సభ స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని, ఈ (బుధవారం) మధ్యాహ్నం 3 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నిరంతరాయంగా చర్చ జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు.కాగా, గత కొన్ని రోజులుగా పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాల పర్వంతో సజావుగా సాగడం లేదు. ప్రతిపక్షాలు తమకు నచ్చిన అంశాలపై చర్చకు పట్టుబడుతూ నిరసనలకు దిగుతుండగా, పార్లమెంటరీ నిబంధనల ప్రకారం చర్చల్లో పాల్గొనాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజా ఆరోపణలు, సవాళ్లతో అధికార-ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది.




నన్ను లుంగీవాలా అంటూ దూషించారు: జాన్ బ్రిట్టాస్

రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా అని అన్నారని ఆరోపించారు.ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని అన్నారు. తమ దృష్టిలో అది ధోతీ అని కూడా చెప్పారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా అభిప్రాయపడ్డారు. 'సభ సభ్యులందరూ సమానమే. ఒక ఎంపీపై ఆరోపణలు వచ్చాయి కాబట్టి వారికి తమ వివరణ ఇచ్చేందుకూ అవకాశం ఇస్తున్నాము' అని అన్నారు.

టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా

న్యూఢిల్లీ, ఆగస్టు 12: టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ చైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్ రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు.గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల ముందే చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి.గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ చైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి చైర్మన్‌గా వ్యవహరించారు.



ఇంటెలిజన్స్ వైఫల్యమేనా

అధికార పార్టీలో అనుమానాలు

కర్నూలు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)కర్నూలులో శాంతి భద్రతల సమస్యలపై మంత్రి టీజీ భరత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఒకవైపు హోం మంత్రి అనిత లా అండ్ ఆర్డర్ బాగుందంటూ చెబుతూ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం రౌడీషీటర్లను పీచమణిచేస్తానని ప్రతి సభలో హుంకరిస్తున్నారు. కానీ చంద్రబాబు మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్న టీజీ భరత్ మాత్రం కర్నూలులో ఇంటెలిజెన్స్ తో పాటు అధికార వ్యవస్థ కూడా పూర్తిగా విఫలమయిందని ఆరోపణలు చేయడం సూటిగా కూటమి ప్రభుత్వానికి తాకినట్లయింది. మంత్రి టీజీ భరత్ ఈ వ్యాఖ్యలు ఆయన ఆవేదనలో భాగమయి ఉండవచ్చు. కానీ అది ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే విధంగా ఉన్నాయంటూ పెద్దయెత్తున ప్రత్యర్థులు దానిని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు... కర్నూలులో టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ హత్య ఘటనపై పోలీసుల నిఘా వైఫల్యమంటూ ఏపీ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు ముందే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎందుకు స్పందించలేదని నిలదీశారు. మంత్రుల కదలికలపై నిఘా పెట్టే అధికారులు నేరస్థులపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.పోలీసుల తీరుపై మంత్రి టీజీ భరత్ అసంతృప్తి కర్నూలులో శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నిఘా వ్యవస్థ పనితీరులో స్పష్టమైన వైఫల్యం కనిపిస్తోందని మండిపడ్డారు.హత్యకు ముందే బాధితుడి ఫొటో పెట్టి సోషల్ మీడియాలో 'ఖీఎఖ' అని పోస్ట్ చేసినా పోలీసులు గుర్తించలేకపోవడంపై అసంతృప్తి వెళ్లి బుచ్చారు.మంత్రులు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారనే విషయాలపై ఉండే శ్రద్ధ.. నేరస్థుల కదలికలపై ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు.ఈ ఘటనపై సీఎంను కలిసి ఫిర్యాదు చేస్తానని, రౌడీ మూకల అరాచకాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. కర్నూలులో రౌడీలు రెచ్చిపోతున్నారని మంత్రి భరత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్యలకు తెగబడుతున్నారని మంత్రి భరత్ఇంతియాజ్ హత్య అంటూ వారం క్రితమే సోషల్ మీడియాలో వచ్చిందని, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలపై వాళ్లు నిఘా పెడుతుంటే..పోలీసులు ఏం చేస్తున్నారంటూ మంత్రి భరత్ ప్రశ్నించడం కూటమి ప్రభుత్వంలోని శాంతి భద్రల సమస్యను ఎత్తి చూపుతుందని విపక్ష వైసీపీ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమయిందని, అందుకు తాము కాదని, మంత్రి భరత్ వ్యాఖ్యలే ఉదాహరణ అని చెబుతున్నారు. తన పార్టీ నేత హత్యతో ఆవేదనకు గురైనా మంత్రి టీజీ భరత్ ఆవేదనతో చేసిన వ్యాఖ్యలుగా చూడాలని కూటమిలోని నేతలు సర్దిచెప్పుకుంటున్నా.. అది ప్రభుత్వాన్ని మాత్రం డ్యామేజీ చేసే విధంగా ఉందన్న వ్యాఖ్యలు మాత్రం వినిపిస్తున్నాయి. దీనిపై టీజీ భరత్ ను పార్టీ నాయకత్వం వివరణ కోరే అవకాశాలు లేకపోలేదు.

కోవర్ట్ రాజకీయాలు - టీడీపీ వర్గాల అనుమానాలు

ఒంగోలు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా ముఖ్యంగా ఒంగోలు నియోజకవర్గంలో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి , స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ల మధ్య తలెత్తిన రాజకీయ వైరం తీవ్ర రూపం దాల్చుతోంది. వైఎస్సార్సీపీ ని వీడి జనసేనలో చేరినప్పటి నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి స్థానిక ఎమ్మెల్యే దామచర్లను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించడం, దానికి ప్రతిగా దామచర్ల కూడా సవాళ్లు విసరడంతో ఒంగోలు రాజకీయాలు కూటమి వర్సెస్ కూటమి అనే స్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల కుటుంబాల మధ్య రాజకీయ వైరం దశాబ్దాలుగా కొనసాగుతోంది. గతంలో ఇరు నాయకులు ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీపడేవారు. అయితే బాలినేని జనసేన పార్టీలో చేరినప్పటికీ, పాత విభేదాలు మాత్రం వీడలేదు. ఒంగోలుపై తన పట్టు నిలుపుకోవాలని బాలినేని ప్రయత్నిస్తుంటే, సిట్టింగ్ ఎమ్మెల్యేగా పూర్తి ఆధిపత్యం చెలాయించాలని దామచర్ల భావిస్తున్నారు. ఇద్దరి లక్ష్యం ఒంగోలు రాజకీయాన్ని శాసించడమే కావడంతో ఈ ఘర్షణ వ్యక్తిగత స్థాయికి చేరింది. తాజాగా బాలినేని తన అనుచరులను కాపాడుకునేందుకు నేరుగా రంగానికి దిగారు. స్థానిక పోలీసులు ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిళ్లతో తన వర్గానికి చెందిన వారిపై, జనసేన కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇసుక, మద్యం, రేషన్ బియ్యం మాఫియాల వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి కౌంటర్‌గా.. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అక్రమాల నుంచి తప్పించుకోవడానికే బాలినేని జనసేన ముసుగు వేసుకున్నారని, ఒంగోలులో రౌడీయిజం చెల్లదని దామచర్ల విమర్శలు గుప్పించడంతో పరిస్థితి తీవ్రమైంది.జనసేనలో చేరినప్పటికీ బాలినేని వైఎస్సార్సీపీ నాయకులకు మద్దతుగా పనిచేస్తున్నారని, టీడీపీ-జనసేన కూటమిలో చిచ్చు పెట్టేందుకు 'కోవర్ట్'గా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్సీపీ నేతలపై విచారణ జరగకుండా అడ్డుకోవడానికి , తన పాత కేడర్‌ను కాపాడుకోవడానికి జనసేన జెండాను వాడుకుంటున్నారనే ఆరోపణలు టీడీపీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. నాయకుల మధ్య సాగుతున్న ఈ పోరు సోషల్ మీడియా వార్‌గా మారి, ఇప్పుడు నేరుగా వీధుల్లోకి వచ్చే వాతావరణం కనిపించడం వల్ల టీడీపీ, జనసేన దిగువ స్థాయి కేడర్ తీవ్ర గందరగోళానికి గురవుతోంది. ఎన్నికల్లో కలసి పనిచేసిన రెండు పార్టీల శ్రేణులు ఇప్పుడు పరస్పరం పోలీసు స్టేషన్ల ముందు ధర్నాలు చేయడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం వల్ల ఉమ్మడి క్యాడర్ స్ఫూర్తి దెబ్బతింటోంది.ఒంగోలులో సాగుతున్న ఈ అంతర్గత పోరు కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి నేతలే ఒకరిపై ఒకరు ఇసుక, మద్యం అవినీతి ఆరోపణలు చేసుకోవడం ప్రతిపక్ష వైఎస్సార్సీపీకి అతిపెద్ద రాజకీయ ఆయుధంగా మారింది. ఈ సెగ కేవలం ఒంగోలుకే పరిమితం కాకుండా ప్రకాశం జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు పాకితే, కూటమిలోని టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య సఖ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది.పరిస్థితి చెయ్యి దాటుతుండటంతో టీడీపీ, జనసేన అధిష్టానాలు త్వరితగతిన స్పందించాయి. ఇరు పార్టీల సీనియర్ నేతలు కలసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, ఇద్దరు నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. బహిరంగ విమర్శలు ఆపి, ఏవైనా సమస్యలు ఉంటే సమన్వయ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి - దామచర్ల జనార్ధన్ ల మధ్య పోరు కేవలం ఒక స్థానిక నియోజకవర్గ సమస్య కాదు. స్థానికంగా బలంగా ఉన్న పాత ప్రత్యర్థులు కూటమి గొడుగు కిందకి వచ్చినప్పుడు తలెత్తే సవాళ్లకు ఇది అద్దం పడుతోంది. అధిష్టానాలు వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ వ్యక్తిగత ఆధిపత్య పోరు కూటమి ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.మరో వైపు సమన్వయ కమిటీ నాయకులు ఒంగోలు పరిణామాలకు సంబంధించిన వివరాలను సంబంధిత నేతల నుంచి నేరుగా తెలుసుకునేందుకు జూమ్ ద్వారా మాట్లాడారు. ఇరువర్గాల అభిప్రాయాలను విన్న అనంతరం సమస్యలు ఏవైనా ఉంటే పార్టీ వ్యవస్థలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి లేదా కూటమికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం వల్ల రాజకీయంగా ప్రత్యర్థులకు అవకాశం కల్పించినట్లవుతుందని హెచ్చరించారు.నేతలు తమ సమస్యలను పార్టీ అధిష్టానాలు, సమన్వయ కమిటీల దృష్టికి తీసుకురావచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పాలనలో ముందుకు సాగుతున్న సమయంలో చిన్నపాటి విభేదాలు పెద్ద రాజకీయ అంశాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపైనా ఉందని పేర్కొన్నారు. కూటమి బలంగా ఉంటేనే ప్రభుత్వానికి రాజకీయ స్థిరత్వం కొనసాగుతుందని, అందువల్ల వ్యక్తిగత విభేదాల కంటే సమిష్టి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఒంగోలు వివాదంపై తాజా చర్యలతో ఇకపై కూటమి భాగస్వామ్య పార్టీల నేతల మధ్య సమన్వయానికి మరింత ప్రాధాన్యం దక్కే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా బహిరంగ విమర్శలకు దూరంగా ఉండి, సమస్యలను అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని నాయకత్వం స్పష్టంగా ఇచ్చినట్లయింది.

నో వర్క్ - నో పే .. జీతభత్యాల కోత పెడతారా?

విజయవాడ, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు డీఎస్సీపై అసెంబ్లీ ముట్టడిని ప్రకటిస్తామని అంటున్నారు. నిజానికి అసెంబ్లీకి గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ నేతలు క్రమం తప్పకుండా దూరంగా ఉండటం, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాబోమని తెగేసి చెప్పారు. వైఎస్సార్సీపీకి శాసనసభలో 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జగన్ మినహా అందరూ హాజరుకాకుండానే ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్నారు. అందుకే నో వర్క్ - నో పే అనే విధానం గురించి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చాలా సార్లు చర్చించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక శాసనసభ సభ్యుడు సభ ముందస్తు అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక సాంకేతిక అంశం ఉంది. ఈ 60 రోజుల సమయాన్ని లెక్కించేటప్పుడు, సభ వాయిదా పడిన సమయాన్ని లేదా వరుసగా 4 రోజుల కంటే ఎక్కువ రోజులు సభ లేని కాలాన్ని మినహాయిస్తారు. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు ఏడాదికి 15 నుండి 20 రోజులకు మించి జరగవు. కాబట్టి కేవలం సమావేశాలకు రాలేదనే కారణంతో రాజ్యాంగబద్ధంగా 60 రోజుల గైర్హాజరును నిరూపించి అనర్హత వేటు వేయడం కొంత సమయంతో కూడుకున్న ప్రక్రియకేవలం రాజ్యాంగంలోని 60 రోజుల నిబంధనే కాకుండా, ఏపీ శాసనసభ నిర్వహణ నిబంధనల ప్రకారం స్పీకర్‌కు విస్తృతమైన అధికారాలు ఉంటాయి. సభను , రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా "మేము అసెంబ్లీకి రాము" అని బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టి రికార్డెడ్ వ్యాఖ్యలు చేయడం, ప్రజాప్రతినిధిగా ప్రమాణం చేసి కూడా సభ పట్ల బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని సభా హక్కుల ఉల్లంఘన కింద పరిగణించే అవకాశం ఉంది. ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారణ జరిపి, నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా హాజరు కాకపోతే సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా స్పీకర్ ముందడుగు వేయవచ్చు. అనర్హత వేటు కంటే ముందు ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రధాన ఆయుధం నో వర్క్ - నో పే. సభకు హాజరు కాకుండా ప్రజాధనం నుంచి జీతాలు, భత్యాలు తీసుకోవడం నైతికంగా తప్పని ఇప్పటికే స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. ఒకవేళ సభ్యులు సభకు రాకపోతే వారి అలవెన్సులు, పెన్షన్ లేదా జీతాలను నిలిపివేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇది పొలిటికల్ , లీగల్ చెక్-మేట్ అవుతుంది. జీతాలు ఆపేస్తే.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించక తప్పదు, అప్పుడు సభకు ఎందుకు వెళ్లడం లేదో కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది.వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే, ఆయా నియోజకవర్గాల్లో 6 నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తమను అణచివేస్తున్నారని, కక్షసాధింపు చర్యలతోనే సభ్యత్వాలు రద్దు చేశారని వైసీపీ సానుభూతి పొందే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ఉపఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం చేయలేరు కాబట్టి, వారిపై అనర్హత వేటు వేస్తే ఉపఎన్నికల్లో వారిని గెలిపించుకోవడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడుతుందని, దాంతో వైసీపీ క్యాడర్ పూర్తిగా కుప్పకూలుతుందని మరో వ్యూహాత్మక వర్గం వాదిస్తోంది. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా గొంతు విప్పి అడగాల్సిన ఎమ్మెల్యేలు.. కేవలం హోదా దక్కలేదనే నెపంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జీతాల రూపంలో దండుకోవడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో అభిప్రాయం వినిపిస్తోంది. సభకు రాని పక్షంలో రాజీనామా చేసి బయటకు రావాలని, లేదా ప్రభుత్వం వెంటనే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ నిబంధనలను, రాజ్యాంగ సూత్రాలను పరిశీలిస్తే.. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్‌కు స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. కాకపోతే అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, రాజకీయ పరిణామాలకు దారితీసే అంశం. ప్రభుత్వం ముందస్తుగా నో వర్క్ - నో పే విధించి, ఆ తర్వాత నోటీసులు ఇచ్చి నిలదీసే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారా అనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. 2024లో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన అనేక అసెంబ్లీ సమావేశాలకు జగన్ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన సభకు ఎందుకు రావడం లేదన్న ప్రశ్న పదేపదే తెరపైకి వచ్చింది.ప్రజా సమస్యలపై చర్చించడానికి శాసనసభ కీలక వేదిక కావడంతో ప్రతిపక్ష నాయకుడు సభలో ఉండాలని అధికార, ప్రతిపక్ష వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పిన విషయం కూడా రాజకీయ చర్చకు కారణమైంది. ఈ అంశంపై ఆయన న్యాయపరమైన మార్గాలను కూడా ఆశ్రయించినప్పటికీ అనుకున్న ఫలితం రాలేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇటీవల వైసీపీ మెగా డీఎస్సీ అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వైసీపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇదే అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగే అవకాశం కూడా ఉంది.మరోవైపు జగన్ అసెంబ్లీకి గైర్హాజరయ్యే విషయంలో సభ్యుల హాజరుకు సంబంధించిన నిబంధనలు కూడా చర్చలోకి వస్తున్నాయి. ఒక ఎమ్మెల్యే వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే నిబంధనల ప్రకారం సభ్యత్వంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాబోయే సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. 2025 ఫిబ్రవరి 24న జగన్ సభకు హాజరైనట్లు, అనంతరం 2026 ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లినట్లు రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో ఆయన వ్యవహరించే తీరు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.జగన్ మరోసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే, ప్రజా సమస్యలపై చర్చించే ప్రధాన వేదికకు ఆయన దూరంగా ఉంటున్నారనే భావన ప్రజల్లో బలపడే అవకాశం ఉంది. ఇది ప్రజా తీర్పును గౌరవించడం లేదన్న అభిప్రాయానికి దారితీసి, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది.

బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా

నెల్లూరు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృధా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. వైసీపీ ఏ అంశంలోనైనా దానిని తుది వరకూ తీసుకెళ్లగలమన్న నమ్మకం ఉంటేనే కొనసాగించాలని, లేకుంటే కొన్ని రోజులు ఆందోళనలు చేసి వదిలేస్తే మంచిదన్న సూచనలు కూడా వెలువడుతున్నాయి. కానీ జగన్ మాత్రం మెగా డీఎస్సీపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాల్సిందేనన్న ఆదేశాలు ఇవ్వడంతో నేతలు విధిలేని పరిస్థితుల్లో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేపట్టిన పోరాటం వల్ల రాజకీయంగా ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరకపోగా, న్యాయస్థానంలో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులు, ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.న్యాయస్థానంలో ఎదురుదెబ్బలుమెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దాఖలు చేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్‌ను వాడరాదని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు.ఇది కేవలం డైవర్షన్ రాజకీయాలంటూ అధికార కూటమి పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు.మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం, అభ్యర్థులు చెబుతుండటంతో, ఈ అంశంపై వైసీపీ పోరు జనంలోకి బలంగా వెళ్లడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. మొత్తం మీద ఈ పోరాటం నిష్ప్రయోజనమేనని అంటున్నారు.

ఈడేపల్లిలో ఆక్సిజన్ సిలిండర్ లీకేజ్..

రెండు బైక్‌లు, కారు ధ్వంసం

మచిలీపట్నం ఈడేపల్లిలో బెల్ కంపెనీ వెనుక ప్రాంతంలో బుధవారం ఆక్సిజన్ సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా కలకలం రేగింది. లీకేజీ కారణంగా సిలిండర్ అదుపుతప్పి సమీపంలోని ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారు ధ్వంసమయ్యాయి.ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది లీకేజీని అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.సిలిండర్ లీకేజీతో భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

జనసేనకు మరో మంత్రి పదవి..?

విశాఖపట్టణం, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలోనే ఒకేసారి కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం త్వరలోనే ఏపీ క్యాబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు అమరావతి వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ఈ ప్రక్షాళనలో భాగంగా భాగస్వామ్య పక్షమైన జనసేన పార్టీకి మరో అదనపు మంత్రి పదవి దక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జనసేన నుంచి క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తోపాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రులుగా కొనసాగుతుండగా.. ఇప్పుడు నాలుగో బెర్త్ ఎవరికి దక్కుతుందనే అంశంపై కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.ఈసారి దక్కబోయే అదనపు మంత్రి పదవిని ఉత్తరాంధ్ర రీజియన్‌కు కేటాయించాలని కూటమి పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. జనసేన కోటాలో రాబోయే ఈ కొత్త పదవితో ఉత్తరాంధ్రకు లభించనున్న నాలుగో మంత్రి పదవిగా ఇది నిలవనుంది. ముఖ్యంగా ఈ మంత్రి పదవి రేసులో బీసీ వర్గాలకు పెద్దపీట వేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మంత్రి పదవి రేసులో ఇద్దరు కీలక నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అందులో ఒకరు అనకాపల్లి నుంచి గెలిచిన సీనియర్ నేత కొణతాల రామకృష్ణ కాగా.. మరొకరు విశాఖపట్నం సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్. అయితే, ఉత్తరాంధ్రలో అత్యంత బలమైన సామాజికవర్గంగా ఉన్న గవర వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఆ వర్గానికి చెందిన సీనియర్ లీడర్ కొణతాల రామకృష్ణకే మంత్రి పదవి దక్కే అవకాశాలు అత్యధికంగా ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.ఆయనకున్న రాజకీయ అనుభవం, సీనియారిటీ కూడా దీనికి ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పేరు కూడా గట్టిగా పరిశీలనలో ఉన్నప్పటికీ, సామాజిక సమీకరణాలు మరియు ప్రాంతీయ బలోపేత వ్యూహాల ప్రకారం కొణతాల రామకృష్ణ వైపే అధిష్ఠానం మొగ్గు చూపవచ్చని అంటున్నారు.

నెరవేరనున్న ప్రకాశం వాసుల కల

ఒంగోలు, ఆగస్టు 12, (న్యూస్ పల్స్)కరువు కోరల్లో చిక్కుకుని, తాగడానికి చుక్క నీరు లేక, ఫ్లోరైడ్ రక్కసితో అల్లాడిపోతున్న పశ్చిమ ప్రకాశం (కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా) ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన ప్రతిష్టాత్మక వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఈ నెలాఖరులోనే కృష్ణా జలాలను విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వర్షాధారం మినహా మరే ఇతర నీటి సౌకర్యం లేని మెట్ట భూముల్లో త్వరలోనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుండటంతో స్థానిక రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.శ్రీశైలం సమీపంలోని కృష్ణానది కొల్లంవాగు నుంచి నీటిని తరలించేందుకు నల్లమల కొండల్లో నిర్మించిన 18.8 కిలోమీటర్ల పొడవైన రెండు సమాంతర సొరంగాల్లో.. రెండో సొరంగానికి సంబంధించిన చివరి విడత లైనింగ్ పనులు ప్రస్తుతం ముగింపు దశకు వచ్చాయి. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీలోగా ఈ మిగిలిన పనులన్నింటినీ పూర్తి చేసేలా అధికారులు డే అండ్ నైట్ కష్టపడుతున్నారు. ఈ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడంపైనే నీటి విడుదల ఆధారపడి ఉంది.ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో ప్రస్తుతం శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా మారింది. జూరాల నుండి వస్తున్న ఈ వరద నీటిని పక్కాగా వాడుకుని, నల్లమల సాగర్ కాలువ ద్వారా నీటిని వదిలేందుకు లీన్ పీరియడ్ ప్లాన్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది.

స్పోర్ట్స్ న్యూస్

బంగ్లాదేశ్‌కు షాకిచ్చిన బీసీసీఐ.. అఫ్గాన్‌తో భారత టీ20 సిరీస్ ఖరారు!

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)కి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) బిగ్ షాకిచ్చింది. సెప్టెంబర్‌లో తమతో సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా వస్తుందని ఆశించిన బీసీబీకి నిరాశే ఎదురైంది. అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఖరారు చేసి బంగ్లా పర్యటనకు వెళ్లడం లేదని పరోక్షంగా వెల్లడించింది.సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌ను బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. అఫ్గాన్ క్రికెట్ బోర్డు వెల్లడించినట్లుగానే ఢిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ జరగనుంది. భారత్‌లోనే అఫ్గాన్ టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఢిల్లీ మైదానాన్ని అఫ్గాన్ హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. గత జూన్‌లో భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే.భారత్, అఫ్గానిస్థాన్ మధ్య సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15 రెండో టీ20, సెప్టెంబర్ 19న మూడో టీ20 జరగనుంది. భారత క్రికెట్ బోర్డు ఎప్పుడూ అఫ్గానిస్థాన్‌కు అండగా ఉంటుందని బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ తెలిపారు. అఫ్గాన్ క్రికెట్ అభివృద్ధి కోసం మద్దతు ఇస్తామని, అత్యున్నత స్థాయిలో పోటీ పడేలా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పాడు. ఈ క్రమంలోనే ఆ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌ను ఏర్పాటు చేశామని, టాప్ టీమ్స్‌తో ఆడటం వల్ల వెలకట్టలేని అనుభవం వస్తుందని అభిప్రాయపడ్డాడు.భారత్ వేదికగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తున్న సిరీస్‌కు బీసీసీఐ అండగా ఉంటుందని సెక్రటరీ దేవజిత్ సైకియా అన్నారు. మైదానంలో ఇరు జట్ల మధ్య పోరు చాలా ఆసక్తికరమని, నాణ్యమైన క్రికెటర్లు ఉన్నారని పేర్కొన్నారు. భారత్‌లోనూ అఫ్గాన్ ఆటగాళ్లకు అభిమానులు ఉన్నారంటే వారి ఆటతీరే కారణమని, ఇటీవల ఒక టెస్ట్, వన్డే సిరీస్ జరిగిందని, మూడు ఫార్మాట్లలోనూ ఇరు జట్లు తలపడేందుకు ఉన్న అవకాశాలను ఏ మాత్రం వదులుకోమని స్పష్టం చేశారు.



అసూయ ఆంటీతో తిలక్ వర్మ.. వైరల్‌గా మారిన వీడియో!

అంతర్జాతీయ క్రికెట్‌కు విరామం రావడంతో టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మ సరదాగా గడుపుతున్నాడు. ఈ ఖాళీ సమయాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆస్వాదిస్తున్నాడు. భారత్‌కు ఇప్పట్లో టీ20 మ్యాచ్‌లు లేకపోవడంతో తిలక్ వర్మ ఇంటికే పరిమితమయ్యాడు.ఈ ఖాళీ సమయంలో తిలక్ వర్మ.. తన కళా పోషణను బయటపెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రిల్స్ చేస్తూ తన యాక్టింగ్ స్కిల్స్‌ను బయటపెట్టుకుంటున్నాడు. ప్రముఖ ఇన్‌స్టా ఇన్ఫ్లుయెన్సర్ రీనుతో ఓ రీల్‌లో నటించాడు. ఇందులో చాలా సహజంగా నటించి నెటిజన్ల మనసును గెలుచుకున్నాడు.తన కొడుకు కంటే ఎక్కువ సంపాదించే చుట్టాల అబ్బాయిని చూసి అసూయపడే ఆంటీ అనే కాన్సెప్ట్‌తో ఈ రీల్‌ను రూపొందించారు. ఇందులో రీను అసూయపడే ఆంటీలా నటిస్తే.. తిలక్ వర్మ బాగా సంపాదించే కుర్రాడిలా నటించాడు. డైలాగ్స్ లేకపోయినా కేవలం హావభావాలతో ఇద్దరూ అదరగొట్టారు. తిలక్ వర్మ అయితే జీవించాడు. మనిషన్నాకా కాస్తంత కళా పోషణ ఉండాలి అనే రీతిలో యాక్టింగ్ అదరగొట్టాడు.ఈ వీడియోను షేర్ చేసిన రీనూ.. దమ్ముంటే ఈ రీల్‌ను మీ అసూయపడే ఆంటీకి పంపించండి అని క్యాప్షన్‌గా పేర్కొంది. ఈ రీల్‌కు నెటిజన్ల నుంచి భారీ స్పందన వచ్చింది. భారీ సంఖ్యలో వ్యూస్, లైక్స్‌తో దూసుకెళ్తోంది. రిటైర్మెంట్ తర్వాత యాక్టర్‌గా తిలక్ వర్మ రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టేలా ఉన్నాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. సినీ రంగంలో తిలక్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని జోస్యం చెబుతున్నారు. అంతర్జాతీయ టీ20ల్లో టీమిండియా వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్న తిలక్ వర్మ.. దులీప్ ట్రోఫీలో బరిలోకి దిగనున్నాడు.ఆగస్ట్ 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు జరగనున్న ఈ టోర్నీలో సౌత్ జోన్‌కు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. భారత్ తరపున ఒకే ఫార్మాట్ ఆడుతున్న తిలక్ వర్మ.. మూడు ఫార్మాట్లు ప్లేయర్‌గా మారేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. భవిష్యత్తులో టీమిండియా టీ20 సారథ్య బాధ్యతలను కూడా అందుకునే అవకాశం ఉంది.



7 సిక్స్‌లతో టీమ్ సీఫెర్ట్ ఊచకోత.. చిత్తుగా ఓడిన సన్‌రైజర్స్!

న్యూజిలాండ్ బ్యాటర్ టీమ్ సీఫెర్ట్(40 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లతో 80 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న ది హండ్రెడ్ లీగ్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న టీమ్ సీఫెర్ట్.. సన్‌రైజర్స్ లీడ్స్‌తో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 7 సిక్స్‌లతో వీర విహారం చేశాడు. ఇందులో హ్యాట్రిక్ సిక్స్‌లు బాదడం గమనార్హం.టీమ్ సీఫెర్ట్ విధ్వంసంతో ఈ మ్యాచ్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ 10 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ లీడ్స్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ లీడ్స్ 100 బంతుల్లో 127 పరుగులు చేసింది.మిచెల్ మార్ష్(23 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 32), జాక్ క్రాలీ(28 బంతుల్లో ఫోర్‌తో 31) టాప్ స్కోరర్లుగా నిలిచారు. మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ మూడు వికెట్లు తీయగా.. సోనీ బేకర్ రెండు వికెట్లు పడగొట్టాడు. జోష్ టంగ్, లియామ్ డాసన్, నూర్ అహ్మద్, పాల్ వాల్టర్ తలో వికెట్ తీసారు.అనంతరం మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ 67 బంతుల్లో 128 పరుగులు చేసి నునాయన విజయాన్నందుకుంది. టీమ్ సీఫెర్ట్‌తో పాటు పాల్ వాల్టర్(28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 44 నాటౌట్) పర్వాలేదనిపించారు. టీమ్ సీఫెర్ట్ ధాటికి సన్‌రైజర్స్ లీడ్స్ బౌలర్లు తేలిపోయారు. బ్రైడన్ కార్స్ వేసిన 7, 8, 9 బంతుల్లో టీమ్ సీఫెర్ట్ వరుసగా మూడు సిక్స్‌లు బాదాడు.ఈ లీగ్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలు సాధించి రెండో స్థానంలో నిలిచింది. సన్‌రైజర్స్ లీడ్స్ కూడా 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలు సాధించి మూడో స్థానంలో నిలిచింది. టేబుల్ టాపర్‌గా నిలిచిన ట్రెంట్ రాకెట్స్ 8 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది.ప్రస్తుతం టాప్-3లో ఉన్న సన్‌రైజర్స్ లీడ్స్, మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ ఎలిమినేటర్ మ్యాచ్ రేసులో ఉన్నా.. ఎంఐ లండన్, వెల్ష్ ఫైర్ జట్ల మధ్య జరిగే లీగ్ మ్యాచ్ ఫలితంపై వారి భవితవ్యం ఆధారపడి ఉంది. ఎంఐ లండన్ భారీ విజయం సాధిస్తే సన్‌రైజర్స్ లీడ్స్ టోర్నీ నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది.




పెళ్లి చేసుకున్న ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో



లిస్బన్: పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో పెళ్లి చేసుకున్నాడు. పదేళ్లుగా కలిసి జీవిస్తున్న తన ప్రియురాలు జార్జియానా రోడ్రిగేజ్‌ను అతను మ్యారేజ్ చేసుకున్నాడు. ఆ జోడీ ఇప్పుడు అధికారికంగా భార్యాభర్తలు అయ్యారు. రాజధాని లిస్బన్‌కు సమీపంలో ఉన్న కాస్‌కేయస్ అనే కోస్టల్ పట్టణంలో పెళ్లి వేడుక జరిగింది. ఈ మ్యారేజీకి అతని అయిదుగురు పిల్లలు కూడా హాజరయ్యారు. రింగులు మార్చుకున్న పిక్స్‌ను ఆ ఇద్దరూ తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లలో పోస్టు చేశారు.మాడ్రిడ్‌లో కలుసుకున్న ఆ జోడీ గత పదేళ్లుగా కలిసి ఉంటోంది. క్రిస్టియానో రోనాల్డో వయసు 41 ఏళ్లు. అయిదు సార్లు అతను బెస్ట్ ఫుట్‌బాల్ ప్లేయర్ అవార్డును గెలుచుకున్నాడు. క్రీడారంగంలో హై ప్రొఫైల్ స్టార్‌గా నిలిచాడు. ఇటీవల అమెరికా వేదికగా జరిగిన ఫుట్‌బాల్ వరల్డ్‌కప్‌లోనూ అతను ఆడాడు. రికార్డు స్థాయిలో ఆరోసారి అతను వరల్డ్‌కప్‌లో ప్రాతినిధ్యం వహించాడు.

రెజ్లర్ సుశీల్ కుమార్‌కు బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ: ఒలింపిక్ రెజ్లర్ సుశీల్ కుమార్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. మాజీ జూనియర్ జాతీయ రెజ్లింగ్ చాంపియన్ సాగర్ ధంకర్ మర్డర్ కేసులో సుశీల్ కుమార్ శిక్ష అనుభవిస్తున్నాడు. ఆగస్టు 6వ తేదీన రెజ్లర్ సుశీల్ కుమార్ బెయిల్ దరఖాస్తును జస్టిస్ పురుషేంద్ర కుమార్ డిస్మిస్ చేశారు. అరెస్టు చేయడానికి ముందు అతని ప్రవర్తన, నేరం తీవ్రత, సాక్ష్యులను ప్రభావితం చేసే సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బెయిల్‌ను నిరాకరిస్తున్నట్లు గతంలో సుప్రీంకోర్టు కూడా పేర్కొన్నది. ఈ కేసులో రెజ్లర్ సుశీల్ తీవ్రమైన నేరానికి పాల్పడినట్లు జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. ముందుగా ప్లాన్ చేసి హత్య చేశారని, ఆ మర్డర్‌కు చెందిన ఆయుధాన్ని రికవరీ చేశారని, వీడియో ఆధారాలు కూడా ఉన్నట్లు జడ్జి తన తీర్పులో తెలిపారు. ఢిల్లీ పోలీసులు, బాధిత రెజ్లర్ ధంకర్ తండ్రి కూడా బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించారు.

బంగ్లాదేశ్‌కి షాక్ ఇచ్చిన బిసిసిఐ.. అఫ్గాన్‌తో సిరీస్



వచ్చే నెలలో తమతో సిరీస్ ఆడేందుకు టీం ఇండియా వస్తుందని ఇప్పటివరకూ ఆశలు పెట్టుకున్న బంగ్లాదేశ్ జట్టుకు బిసిసిఐ షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ పర్యనకు వెళ్లడం లేదని పరోక్షంగా చెప్పింది. సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో మూడు టి-20ల సిరీస్ షెడ్యూల్‌ను సోషల్‌మీడియాలో షేర్ చేసింది. నిన్న అఫ్గాన్ క్రికెట్ బోర్డు సిఇవో నసీబ్ ఖాన్ చెప్పినట్లుగానే ఢిల్లీ వేదికగా మూడు టి-20ల సిరీస్ జరగనుంది. గత జూన్‌లో భారత్-అఫ్గాన్‌ల మధ్య ఏకైక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ జరిగిన విషయం తెలిసిందే.క ఢిల్లీ వేదికగా సప్టెంబర్ 13, 15, 19 తేదీల్లో మూడు టి-20ల సిరీస్ జరగనుంది. "బారత క్రికెట్ బోర్డు ఎల్లవేళలా అఫ్గానిస్థాన్‌కు బాసటగా ఉంటుంది. అఫ్గాన్ క్రికెట్ వృద్ధి కోసం మద్దతు ఇస్తాం. అత్యున్న త స్థాయిలో పోటీపడేలా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం. అందులో ద్వైపాక్షిక సిరీస్‌లూ ముఖ్యమైన భాగమే. నాణ్యమైన జట్లతో ఆడటం వల్ల వెలకట్టలేని అనుభవం వస్తుంది. భారత్‌తో టి-20 సిరీస్ కోసం అఫ్గానిస్థాన్‌ను ఆహ్వానిస్తున్నాం" అని బిసిసిఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు.

హార్దిక్ పాండ్యా కండీషన్.. కుదరదని చెప్పిన గుజరాత్

ఇండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపిఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టును వీడుతున్నాడని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. గత ఐపిఎల్ సీజన్‌లో ముంబై చెత్త ప్రదర్శన చేయడానికి హార్దిక్ కెప్టెన్సీ కూడా కారణమని విమర్శలు వచ్చాయి. దీంతో హార్దిక్‌ను వచ్చే సీజన్‌కి వేరే జట్టుకు ట్రేడింగ్ చేసేందుకు ముంబై సిద్ధమైనట్లు తెలిసింది. అయితే హార్దిక్‌ని తమ జట్టులోకి తీసుకునేందుకు కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ఆసక్తి చూపాయని సమాచారం. తాజాగా గుజరాత్ టైటాన్స్ జట్టుకు హార్దిక్ వెళ్తాడని ప్రచారం మొదలైంది. ఇందుకు గుజరాత్ కూడా అంగీకరించిదని టాక్. అయితే హార్దిక్ పెట్టిన ఓ కండీషన్ కారణంగా గుజరాత్ అతన్ని తీసుకోవడంలో వెనక్కి తగ్గిందని తెలుస్తోంది. "గుజరాత్ టైటాల్స్ ఫ్రాంచైజీ కూడా హార్దిక్ తిరిగి రావడాన్ని స్వాగతించింది. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్‌తోనూ చర్చించింది. మళ్లీ పాండ్యాను ట్రేడ్ చేసేందుకు అంగీకరించింది. అయితే హార్దిక్ ఎప్పుడైతే 'కెప్టెన్సీ' షరతు విధించాడో.. ఫ్రాంచైజీ అందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. మేనేజ్‌మెంట్ కుదరదని చెప్పింది" అని గుజరాత్ టైటాన్స్ వర్గాలు తెలిపాయి.



విద్యార్థి సమస్యలపై పోరాటంలో ఏచూరి స్ఫూర్తి

- ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్



వేములవాడ, ఆగస్ట్ 12: సీతారాం ఏచూరి పోరాట స్ఫూర్తితో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఏచూరి జయంతి సందర్భంగా బుధవారం వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ బాధ్యత పెరగాలని ఏచూరి పోరాడారని తెలిపారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన ఉద్యమం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏచూరి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కడరీ శివ, నాయకులు సాయిరాం, అఖిల్, పృథ్వీ, విక్రమ్, తరుణ్, జశ్వంత్, సాయితేజ, ముభారక్, స్నేహిత, ఆఫియా, ప్రవళిక, అంజలి, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ కుటుంబాలకు దుస్తుల పంపిణీ



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 12 తెలంగాణ పవర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలోని సరైన రహదారి సౌకర్యాలు లేని మారుమూల అటవీ ప్రాంతంలోని వలస ఆదివాసీ గ్రామమైన బుడుగులలో లిటిల్ కాజ్ సొసైటీ (ఎల్ జి ఎస్ ఎన్ జి ఓ)ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ నందర్భంగా గ్రామంలోని 33 కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం గ్రామస్థులకు కాలానుగుణంగా వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.రహదారి సౌకర్యాలు సరిగా లేకపోవడం వల్ల ప్రభుత్వ సేవలు, వైద్యం ఇతర అత్యవసర సదుపాయాలను పొందడంలో మారుమూల గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా నిర్వాహకులు తెలుసుకున్నారు.

మారుమూల ఆదివాసీ ప్రాంతాల్లోని ప్రజలకు అండగా నిలుస్తూ, విద్య, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి మానవతా సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని లిటిల్ కాజ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో లిటిల్ కాజ్ సొసైటీ డైరెక్టర్ నిదానపల్లి ప్రసాద్, కో-ఆర్డినేటర్ పడిగ నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రయాణ సమస్యకు కళాశాలను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



మంథని డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రయాణ సమస్యకు పరిష్కారం చూపేందుకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం మంథనిలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ వద్ద ఉన్న భవనాన్ని పరిశీలించారు. మల్లేపల్లి లో ఉన్న డిగ్రీ కళాశాలకు రవాణా సదుపాయం సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, మంథని పట్టణంలోని జూనియర్ కళాశాల భవనంలో డిగ్రీ కళాశాల తరగతులను కొనసాగించే అవకాశాలను పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్య అందించడమే లక్ష్యంగా భవనంలోని మౌలిక వసతులు, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జై కిషన్ ఓజా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉషా, లెక్చరర్లు పాల్గొన్నారు.

పాడి రైతుల సాధికారతకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విజయ డెయిరీ ఒప్పందం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనందించేందుకు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్, తెలంగాణ రాష్ట్ర పాడి పారిశ్రామివాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పంద కార్యక్రమ సభ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె. ప్రతాపరెడ్డి, ఛైర్మన్ శ్రీ గూతా అమిత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డిల సమక్షంలో ఉన్నతాధికారులు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన పాడి రైతులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా వేగంగా, సరిపడా ఆర్థిక రుణాలు అందించడం జరుగుతుందన్నారు. పాడి పశువుల కొనుగోలు, పాడి నిర్వహణ ఖర్చులు, పాడి పరిశ్రమను విస్తరించుకోవడానికి అవసరమైన రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రైవేట్ అనధికారిక వడ్డీ వ్యాపారులపై ఆధారపడటాన్ని తగ్గించి, తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తామని పేర్కొన్నారు.



తెలంగాణలో పాడి రంగానికి నూతన ఊపిరి పోస్తుందని, పాడి రైతులకు ఆర్థిక భద్రతను నిలకడైన ఆదాయాన్ని చేకూరుస్తుందని ఆకాంక్షించారు.

సర్కారు బడి కాపాడుకుందాం వీడియో ఆల్బమ్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మద్దతు



జగిత్యాల జిల్లా, ఆగస్టు 12 (తెలంగాణ పవర్): ఆదివాసీ, గిరిజన గూడేల్లో విద్య ప్రాధాన్యతను చాటిచెప్పడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలనే సందేశంతో రూపొందుతున్న "సర్కారు బడి కాపాడుకుందాం" వీడియో ఆల్బమ్ పోస్టర్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీడియో ఆల్బమ్ రూపకల్పనకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు మంత్రికి వివరించి, ఆడియోను వినిపించారు. ఆదివాసీ గిరిజన గూడేల్లో అడవినే నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాల్లో విద్యపై అవగాహన కల్పించడం, బాల కార్మికత్వానికి దూరంగా పిల్లలను బడిబాట పట్టించడం, చదువుతోనే అభివృద్ధి సాధ్యమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ వీడియో ఆల్బమ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దర్వాజా ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో దర్శకుడు లింగంపల్లి నరేష్ ఈ వీడియో ఆల్బమ్‌ను తెరకెక్కిస్తున్నారు. దీనికి వడ్లకొండ గోవర్ధన్ సాహిత్యం అందించగా, లింగంపల్లి నరేష్ గానం చేస్తున్నారు. మదిరే కృష్ణ చైతన్య సంగీతం అందిస్తున్నారు. జగిత్యాలలోని శ్రీ మహా రికార్డింగ్ స్టూడియోలో సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఫ్లూట్ వాద్యకారుడిగా పోలస సంతోష చారి, ప్రోగ్రామర్‌గా రాహుల్ ఆర్పీ, పోస్టర్ డిజైనర్‌గా మహేష్ వ్యవహరిస్తున్నారు. వీడియో ఆల్బమ్ చిత్రీకరణకు సంబంధించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేసి, ఆడియోను వినిపించారు. కార్యక్రమానికి మంత్రి స్పందిస్తూ "సర్కారు బడి కాపాడుకుందాం" వీడియో ఆల్బమ్‌కు సంపూర్ణ మద్దతు, సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, నాగారం సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, తక్కలపల్లి మాజీ సర్పంచ్ ములిగే శ్రీనివాస్, కథలాపూర్ మండల అంబేద్కర్ సంఘాల అధ్యక్షుడు కలిగోట రాజయ్య, బాలే నీలకంఠం, శనిగారపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డికి ఘన స్వాగతం



జహీరాబాద్ ఆగస్టు 12:రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన చైర్మన్ గిరిధర్ రెడ్డికి బుధవారం జహీరాబాద్ లో ఘన స్వాగతం లభించింది. చైర్మన్ కు పుష్పగుచ్ఛము అందజేసారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్, న్యాల్కల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. నర్సింహారెడ్డి, కే. భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రాములు, నాయకులు కూర నర్సింలు, కే. భీమయ్య, మల్లారెడ్డి, ఇమామ్ పటేల్, హర్షవర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూఢిల్లీలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశాలు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారు



తెలంగాణ పవర్ న్యూస్ ఎల్బీనగర్ డివిజన్ ఆగస్టు: జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ గారు, యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మణిశర్మ గార్ల నేతృత్వంలో మూడు రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి.

ఈ సమావేశాల్లో భాగంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గారిని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి గారు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శివచరణ్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలు, సంస్థాగతంగా చేపడుతున్న కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలను పి పి టి ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు యువత తదితరులు పాల్గొన్నారు

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి -- సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు..



మెట్‌పల్లి, ఆగస్టు 12 (తెలంగాణ పవర్): క్రీడలు ఆడటం ద్వారా స్నేహభావం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని మెట్‌పల్లి ఇంచార్జి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కేవలం పోటీల సమయంలోనే కాకుండా ప్రతిరోజూ క్రీడలను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పరస్పర స్నేహభావం, ఐక్యత పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రణయ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, క్రీడా కార్యదర్శి నీరటి రమణతో పాటు న్యాయవాదులు వడ్డేపల్లి శ్రీనివాసన్, కంతి మోహన్ రెడ్డి, పుప్పాల రాంభూపాల్, పోలకొండ దయాకర్ వర్మ, గడ్డం శంకర్ రెడ్డి, బోడ లక్ష్మణ్, ఒజ్జెల శ్రీనివాస్, అలుముల రాంబాబు, తెడ్డు ఆనంద్, ద్యావని సత్యనారాయణ, చింతకుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా కాంగ్రెస్ కమిటీల నిర్మాణం పూర్తి చేయాలి



నేలకొండపల్లి: మండల కాంగ్రెస్ పార్టీ కమిటీతో పాటు గ్రామ కమిటీలు, అన్ని అనుబంధ సంఘాల కమిటీలను ఈ నెలాఖరులోగా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఓబీసీ జిల్లా జనరల్ సెక్రెటరీ బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ సూచించారు.

జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య అధ్యక్షతన నేలకొండపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి కమిటీలతో పాటు అన్ని అనుబంధ సంఘాల కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ నెలాఖరులోగా కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం మండల స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, జిల్లా కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి వెంకన్న, అధికార ప్రతినిధి బచ్చలకూర నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజని, సర్పంచ్‌లు, అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల సంక్షేమ మరియు పరిరక్షణా కమిటీ సమావేశం బాలల హక్కులు కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి గుండూర్ ఉపసర్పంచ్ ఎన్ రెడ్డి వెంకటరమణారెడ్డి



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి తెలంగాణ పవర్ : ఆగస్టు-12: బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అనీ గుండూర్ ఉపసర్పంచ్ ఎన్ రెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలి తప్ప బడి బయట ఉండరాదనీ సూచించారు.18 సంవత్సరాల నుండి బాలికలకు, 21 సంవత్సరాలు బాలురకు వివాహాలు చేయరాదు.

పిల్లల అక్రమ రవాణా తరలించరాదు. ప్రతినెలా ఈ సమావేశం నిర్వహించేందుకు గ్రామపంచాయతీలో సర్పంచి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ. , ఏ ఎన్ ఎం రాధా, అంగన్వాడీ టీచర్లు పార్వతమ్మ, కవిత, ఆశ వర్కర్ రేణుక విమల, కృష్ణయ్య చంద్రయ్య బీరయ్య హుస్సేన్ ఈశ్వరయ్య రామచంద్రయ్య పాల్గొన్నారు.

టెంట్ డెకరేషన్ ఉ ఈవెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వజ్జ నరేష్, కార్యదర్శిగా అమర్.



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 12 తెలంగాణ పవర్ : మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల టెంట్ డెకరేషన్ ఉ ఈవెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. మణుగూరులోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ ఎన్నికల్లో నాలుగు మండలాలకు చెందిన టెంట్, డెకరేషన్, ఈవెంట్స్ రంగాలకు చెందిన 114 మంది యజమానులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వజ్జ నరేష్, కార్యదర్శిగా అమర్, కోశాధికారిగా ఉమా మహేశ్వర్ (డాన్స్ మాస్టర్) ఎన్నికయ్యారు. నాలుగు మండలాలకు చెందిన టెంట్, డెకరేషన్, ఈవెంట్స్ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారు. నూతన కార్యవర్గం టెంట్ డెకరేషన్, ఈవెంట్స్ రంగానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు, సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని సభ్యులు ఆకాంక్షించారు.

అసోసియేషన్‌లోని సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ, వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సభ్యుల హక్కులు, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం పనిచేయాలని పలువురు సభ్యులు కోరారు.

ఎన్నికల సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వజ్జ నరేష్, కార్యదర్శి అమర్, కోశాధికారి ఉమా మహేశ్వర్‌లకు పలువురు సభ్యులు అభినందనలు తెలిపారు. నాలుగు మండలాల టెంట్, డెకరేషన్, ఈవెంట్స్ రంగానికి చెందిన వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

సినిమా

డి.సురేష్‌బాబు ఆవిష్కరించిన 'హుషార్ పిట్టలు' మూవీ ట్రైలర్

అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియెస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్, పాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక ఈ చిత్రం ట్రైలర్‌ను మేకర్స్ సోమవారం ఉదయం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా

ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు మాట్లాడుతూ " కొన్ని నెలల ముందు బెక్కెం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసింది. తెలంగాణ నుంచి వచ్చిన దర్శక, నిర్మాతలు ఎంతో పాషన్‌తో సినిమా తీశారు. మా సురేష్ ప్రొడక్షన్స్ ప్రతినిధులు ఈ సినిమా చూసి పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇవ్వడంతో ఈ సినిమాను మా సురేష్ ఏషియన్ ఫిలింస్ ద్వారా విడుదల చేస్తున్నాం. ఈ సినిమా విషయంలో ఎదురైన అన్ని కష్టాలు దాటుకుని ఈస్టేజ్‌కు వచ్చారు. వాళ్ల ఎగ్రెసివ్‌తో ఈ సినిమాను మార్కెటింగ్ చేస్తున్నారు. తప్పకుండా అందరి టైమ్‌ను, డబ్బుకు విలువ నిచ్చే సినిమా ఇది నమ్ముతున్నారు. విడుదలకు ముందే కొన్ని షోలు వేస్తున్నారు. ఆ పాజిటివ్ ఫీడ్‌బ్యాక్‌తో.. మౌత్ టాక్‌తో ఈసినిమా మరింత మందికి రీచ్ అవుతుంది. తప్పకుండా ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ " హుషార్ పిట్టలు చిత్రం ఎంతో నేచురల్‌గా ఉంటుంది ఈ సినిమా చూస్తే అందరికి మీ ఊరికి వెళ్లొచ్చిన ఫీలింగ్ కలుగుతుంది. నా హృదయానికి తాకిన సినిమా ఇది. నేను ఎప్పట్నుంచో కోరుకుంటున్న సక్సెస్ ఈ హుషారు పిట్టలు లాంటి కమర్షియల్ సినిమా నాకు ఆ లోటును తీరుస్తుంది. నాకు కమర్షియల్ సక్సెస్ వస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమా విజయంతో నాకు సినీ ఇండస్ట్రీలో కూడా గుర్తింపు వస్తుందని అనుకుంటున్నాను' అన్నారు.

హీరోయిన్ వాసవీ గణేషన్ మాట్లాడుతూ "మూవీని ఎంతో నమ్మకంతో చేశాం. షూటింగ్ సమయంలో ఒకరికొకరం ధైర్యం చెప్పుకుంటూ చిత్రీకరణ చేశాం. మన సినిమాకు ఓ పెద్ద బ్యానర్, ఎవరైనా మంచి సపోర్ట్ దొరికితే బాగుండే అనుకునే సమయంలో బెక్కం వేణుగోపాల్ ద్వారా తెలుసుకుని మా సినిమా సురేష్‌బాబు గారు విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. చిన్న సినిమాగా మొదలైన మా ప్రయాణం సురేష్ ప్రొడక్షన్స్‌తో పెద్ద సినిమాగా మారింది. ఈ సినిమా కోసం అందరం ఎంతో కష్టపడ్డాం. నన్ను, నా నటనను నమ్మి ఈ సినిమా అవకాశం ఇచ్చారు. తప్పకుండా వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టుకుట్టాననే నమ్మకం ఉంది.

హీరో అన్ను మాట్లాడుతూ " ఈ క్షణాల కోసం 5 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. నన్ను నమ్మి దర్శక, నిర్మాతలు నాకు అవకాశం ఇచ్చారు. హీరోగా అవకాశం రావడం నాకు షాకింగ్‌గా అనిపించింది. ఈ సినిమా కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా స్ట్రాంగ్‌గా ఉంటుంది. సినిమా చూస్తుంటే అందరికి తమ సొంతూరికి వెళ్లిన ఫీలింగ్ కలుగుతుంది. అందరూ సినిమాను ఎంతో ఎంజాయ్ చేస్తారు. అందరూ మా సినిమాను ఆదరిస్తారని అనుకుంటున్నాను. మా సినిమాలో



ఎమోషన్, ఫన్ అన్ని ఉంటాయి. ఇలాంటి చిన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారనినే నమ్మకం ఉంది అన్నారు.

బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ " ఓ మంచి సినిమాకు సపోర్ట్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. మంచి సినిమాలు చేస్తే ప్రేక్షక దేవుళ్లు ఆదరిస్తారు అనే విషయం చాలా సార్లు ప్రూవ్ చేశారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారనే విశ్వాసం ఉంది. థియేటర్ వచ్చి ప్రేక్షకులు సినిమా చూస్తే ఒక్క నెగెటివ్ టాక్ కూడా రాదు. తప్పకుండా అందరిని సంతృప్తి పరిచే చిత్రమిది' అన్నారు.

దర్శకుడు బిక్షు మాట్లాడుతూ " టీజర్ వైరల్ అయ్యింది. ఇప్పుడు ట్రైలర్ అంతకు మించి ట్రైలర్ అందరికి నచ్చుతుంది. సినిమా తప్పకుండా హిట్ అవుతుంది. ఈ సినిమా కథ, కథనం అంతా సమాజంలో నేను చూసింది రాసుకున్నాను. ప్రతి సన్నివేశం ఎంతో నేచురల్‌గా ఉంది. కమర్షియల్ అంశాలతో పాటు ఓ సందేశం కూడా ఉంది. అందరూ ఫ్యామిలీతో చూసే సినిమా' ఇది అన్నారు.

ఈ కార్యక్రమంలో గీత రచయిత చిరంజీన్, డీవోపీ రుద్రసాయి, నటులు గోవర్ధన్, భాను, నవీన్ తదితరులు పాల్గొన్నా

ఘనంగా 'పాంచాలి పంచభర్తృక' మూవీ ప్రీ రిలీజ్



డా. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'పాంచాలి పంచభర్తృక'. ఈ చిత్రంలో సరీ ఫర్, రోల్ రిడా, రాజ్ పవన్, జెమినీ సురేష్, వెంకట్ దుగ్గిరెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఫ్యామిలీ డ్రామాతో కూడిన కంప్లీట్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు గంగ సప్తశిఖర. ఈ చిత్రాన్ని రాయల్ థ్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరాం ఆర్ట్స్ బ్యానర్స్ పై వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్ఏ), రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం నిర్మించారు. ఈ నెల 14న 'పాంచాలి పంచభర్తృక' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

×మ్యూజిక్ డైరెక్టర్ మహేశ్ నారాయణ మాట్లాడుతూ× – ఈ మూవీకి మ్యూజిక్ చేసేందుకు డైరెక్టర్ గంగ సప్తశిఖర చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. తక్కువ టైమ్ లోనే సాంగ్స్ అన్నీ కంపోజ్ చేయగలిగాం. ప్రయోగాత్మకంగా కంపోజ్ చేసిన ఒక కవ్వాలీ సాంగ్ రాజేంద్రప్రసాద్ గారు విని ఇది చాలా బాగుంది మూవీలో పెట్టమని చెప్పారు. మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా 'పాంచాలి పంచభర్తృక' మీ అందరినీ ఆకట్టుకుంటుంది. అన్నారు.

×డైరెక్టర్ గంగ సప్తశిఖర మాట్లాడుతూ× – మా సినిమా ఆద్యంతం మిమ్మల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. సినిమా మీకు నచ్చకపోతే మా రాయల్ థ్రోన్ బ్యానర్ ఇన్ స్టా పేజికి టికెట్ పెట్టండి మీ డబ్బులు రిటర్న్ ఇస్తాం. ప్రేక్షకులు మెచ్చిన ఏ సినిమా అయినా ఫెయిల్ కాదు. మా సినిమా ఈ నెల 14న వరల్డ్ వైడ్ రిలీజ్ అవుతోంది. అమెరికాలో కూడా పెద్ద సంఖ్యలో లొకేషన్స్ లో మా మూవీ రిలీజ్ కు వస్తోంది. మా ప్రొడ్యూసర్స్ వెంకట్ దుగ్గి రెడ్డి, రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టి వారి, సాయినాథ్ మన్యం ఎంతో ప్యాషన్ తో ఈ సినిమా నిర్మించారు. రాజ్ పవన్, వెంకట్ దుగ్గిరెడ్డి ఈ చిత్రంలో కీ రోల్స్ చేశారు. వారి నటన మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. రాజేంద్రప్రసాద్ గారు ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు నన్ను ఇంతలా వాడుకున్న దర్శకుడు నువ్వే నికితాబు ఇచ్చారు. ఆయన ఈ సినిమాలో పాటలు, ఫైట్స్ చేశారు. ఇటీవల కాలంలో మాలాంటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ రాలేదని చెప్పగలను. మా చిత్రంలో 50కి పైగా నటీనటులు వివిధ పాత్రల్లో కనిపిస్తారు. ఒక ఈవీవీ, జంధ్యాల, అనిల్ రావిపూడి సినిమాలా మా మూవీలో ఫ్రేమ్ నిండా ఆర్టిస్టులు ఉంటారు. ఈ సినిమా మేకింగ్ లో ప్రతి ఆర్టిస్టు, టెక్నీషియన్ నాకు సపోర్ట్ చేశారు. వారందరికీ థ్యాంక్స్ చెబుతున్నా. అన్నారు.

×నటుడు శ్రీనివాస్ మాట్లాడుతూ× – మా డైరెక్టర్ గంగ సప్తశిఖర కు మంచి కామెడీ టైమింగ్ ఉంది.ఆయన సీన్స్ చెబుతున్నప్పుడే చాలా నవ్వుకున్నాం. నా క్యారెక్టర్ ను ఆయన ఆకట్టుకునేలా రూపొందించారు. ఈ సినిమాలోని ప్రతి పాత్ర మిమ్మల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. ఈ నెల 14న థియేటర్స్ లో 'పాంచాలి పంచభర్తృక' సినిమా తప్పకుండా చూడండి. అన్నారు.

×నటుడు థర్డీ ఇయర్స్ పృథ్వీ మాట్లాడుతూ× – నా కెరీర్ ప్రారంభమైందే రాజేంద్రప్రసాద్ గారి ఆ ఒక్కటీ అడక్కు మూవీతో. ఆ సినిమాలో నా మొదటి సీన్ బైక్ పై వెళ్లే సీన్. ఈ సినిమా వైజాగ్ షెడ్యూల్ టైమ్ లో ఆ సీన్ చేసిన చోట రాజేంద్రప్రసాద్ గారు నేను కలిసి కాసేపు కూర్చుని మాట్లాడుకున్నాం. రాజేంద్రప్రసాద్ గారు సపోర్ట్ చేయకుంటే ఈ థర్టీ ఇయర్స్ కెరీర్ నాకు లేదు. ఈ సినిమాలో మేము కలిసి నటించడం హ్యాపీగా అనిపించింది. మా డైరెక్టర్ గంగ సప్తశిఖర ప్రతిభావంతుడు. ఆయన నవ్వుతూనే మా అందరి దగ్గర నుంచి కావాల్సిన పర్ ఫార్మెన్స్ పిండుకున్నాడు. గంగ సప్తశిఖర దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకుని ఈవీవీ గారు లేని లోటును తీర్చాలని కోరుకుంటున్నా. ఈ సినిమా సక్సెస్ కావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా. అన్నారు.

×నటి కుమారి ఆంటీ మాట్లాడుతూ× – యూట్యూబ్ లో నన్ను ఫేమస్ చేశారు. సినిమాల్లోకి వస్తానని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్ గారికి థ్యాంక్స్ చెబుతున్నా. ఈ మూవీ నన్ను మీకు మరింత దగ్గర చేస్తుందని ఆశిస్తున్నా. అన్నారు.

×నటుడు బాల మాట్లాడుతూ× – దర్శకుడు గంగ సప్తశిఖర నాకు చాలాకాలంగా మిత్రుడు. నేనొక కన్నడ మూవీ ప్లానింగ్ లో ఉన్నప్పుడు ఈ కథ చెప్పారు. ఇందులో డాన్ రోల్ విలన్ గా నటించాలని చెప్పారు. డాన్ రోల్ ఎలా ఉంటుందా అని ఊహించుకుంటూ ఉన్నాను. సెట్స్ లోకి వెళ్లాక ఈ డాన్ క్యారెక్టర్ తోనూ ఫన్ క్రియేట్ చేయొచ్చని మా డైరెక్టర్ చేసి చూపించారు. రాజేంద్రప్రసాద్ గారు షూటింగ్ టైమ్ లో మంచి సలహాలు ఇచ్చి ప్రోత్సహించారు. ఒక ఫ్యామిలీ వాతావరణం సెట్స్ లో ఉండేది. మా సినిమా ఈ నెల 14న రిలీజ్ అవుతోంది మంచి ఎంటర్ టైనర్ మీరంతా చూసి ఆదరించండి. అన్నారు.

×నటి సునీత మాట్లాడుతూ× – ఈ చిత్రంలో పృథ్వీ గారి వైఫ్ పాత్రలో నటించాను. ఇంతమంది సీనియర్ యాక్టర్స్ నటించిన సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. మా మూవీ మిమ్మల్ని ఏమాత్రం నిరాశపర్చదు. ఆద్యంతం వినోదాన్ని అందిస్తుంది. అన్నారు.

×నటుడు యోగి మాట్లాడుతూ× – ప్రస్తుతం థియేటర్స్ లో కొరియన్ కనకరాజు సినిమా ఎలా మీ అందరినీ ఎంటర్ టైన్ చేస్తుందో, మా సినిమా కూడా ఆగస్టు 14వ తేదీ నుంచి అలాంటి ఎంటర్ టైన్ మెంట్ నే అందించబోతోంది. మా డైరెక్టర్ గంగ సప్తశిఖర ప్రతి ఒక్క క్యారెక్టర్ ను బాగా డిజైన్ చేశారు.ఆయన నెక్ట్స్ కూడా ఒక మంచి మూవీ చేయబోతున్నారు. అన్నారు.

×నటుడు రాంకీ మాట్లాడుతూ× – ఈ మూవీలో నేను నటించుకున్నా, నా బెస్ట్ విశెస్ ఈ టీమ్ కు అందించేందుకు వచ్చాను. మా డైరెక్టర్ గంగ సప్తశిఖర నెక్ట్స్ చేయబోతున్న చిత్రంలో నేనొక ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నా. మంచి ఎంటర్ టైన్ మెంట్ తో రాబోతున్న ఈ సినిమాకు మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు.

×కో డైరెక్టర్ రేష్మ మాట్లాడుతూ× – అర్జునుడికి శ్రీకృష్ణుడు ఎలా బలాన్నిస్తాడో మా సినిమాకు మీ ప్రేక్షకులంతా అండగా నిలబడాలి. మా టీమ్ అందరి సపోర్ట్ తో ఒక మంచి సినిమా చేశాం. ఇకపై కూడా మా టీమ్ తో ట్రావెల్ కొనసాగించాలని కోరుకుంటున్నా. అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొని తమ సినిమా మంచి విజయం సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

×నటీనటులు× – డా. రాజేంద్ర ప్రసాద్, సరీ ఫర్, రోల్ రిడా, రాజ్ పవన్, జెమినీ సురేష్, వెంకట్ దుగ్గిరెడ్డి, తదితరులు

ప్రేమనే ఊరిలో' మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్

సురేష్ కొండేటి బ్రాండ్ వాల్యూతో 'ప్రేమనే ఊరిలో'..అనే సినిమా రాబోతోంది. తెలుగు చిత్రసీమలో నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా, జర్నలిస్ట్‌గా తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సురేష్ కొండేటి పేరు వినగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది ఆయన సినిమాల ఎంపిక! విలక్షణమైన, కథాబలం ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించడంలో ఆయనది సిద్ధహస్తుడైన చెయ్యి. ఆయన నిర్మించిన లేదా సమర్పించిన 'ప్రేమిస్తే', 'జర్నీ', 'పిజ్జా', 'షాపింగ్ మాల్' వంటి ఎన్నో చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సాధించిన ఘనవిజయం, ప్రేక్షకులకు ఆయనపై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచింది.

ఏ సినిమాలో అయినా 'సురేష్ కొండేటి' పేరు ఉందంటే.. అందులో ఖచ్చితంగా కంటెంట్ ఉంటుందని, అది ప్రేక్షకులను ఆకట్టుకుని 'హిట్' కావడం ఖాయమని టాలీవుడ్‌లో ఒక గట్టి నమ్మకం ఉంది. కంటెంట్‌ను సరిగ్గా జడ్జ్ చేయడంలో ఆయనకున్న అనుభవం, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లే ప్రమోషన్ వ్యూహాలు ఎప్పుడూ ఫెయిల్ కావు. ఇప్పుడు ఈ '[ప్రేమనే ఊరిలో' చిత్రానికి ఆయన నిర్మాతల్లో ఒకరిగా వ్యవహరిస్తుండటంతో, ఈ సినిమాపై కూడా ట్రేడ్ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

మనోజ్ కుమార్ దర్శకత్వంలో మహారత్న ప్రొడక్షన్స్, ఎస్.కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీ రామ్, రామికా శివు, తపస్విని పూణచ్చ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. "చివశ్రీఇనీఎవ బినీ బిష్టవ శ్రీజీనిట నీట శ్రీనీలవ" అనే క్యాప్షన్‌తో, పచ్చని గ్రామీణ నేపథ్యం, విండ్ మిల్స్, ఎడ్ల బండి మరియు ఆహ్లాదకరమైన భావోద్వేగాలతో విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆదివారం నాడు సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకునే అమ్మవారి బోనాలు పండుగ రోజు ఫిలింనగర్ శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో ఫస్ట్ లుక్ ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.



తెలుగులో 'కెజిఎఫ్' మరియు 'కాంతార' లాంటి బ్లాక్ బస్టర్ ఇండస్ట్రీ హిట్స్ చిత్రాలకు మాటలను అందించిన ఈ సినిమాకు డైలాగ్స్ రాసిన హనుమాన్ చౌదరి డైలాగ్స్ ఈ సినిమాకి హైలైట్స్ గా చెప్పుకోవచ్చు. అలాగే 'అర్జున్ రెడ్డి','మజ్ను','మజిలీ', 'కాంతార', 'హరిహర వీరమల్లు', 'మిరాయ్', 'కూలీ', 'కొత్తలోక' వంటి బ్లాక్ బస్టర్ విచిత్రాలకు పాటల అందించిన రాంబాబు గోశాల ఈ సినిమాలోని అన్ని పాటలను సింగల్ కార్డుగా రాయడం మరో విశేషంగా చెప్పుకోవచ్చు. సునాద్ గౌతమ్ సంగీతం, రాజ్‌కాంత్ ఎస్.కే కెమెరా పనితనం, ఈ చిత్రానికి మరిన్ని ప్లస్ పాయింట్లు. సురేష్ కొండేటి సక్సెస్ ఫుల్ ట్రాక్ రికార్డ్‌ను కొనసాగిస్తూ, ఈ 'ప్రేమనే ఊరిలో' కూడా మరొక బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది!

రంగాయణ రఘు, శ్రీరామ్, తపస్విని పూనాచా, రమిక శివు తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం (ఆూఖ): రాజ్‌కాంత్ ఎస్. కె, ఎడిటర్: హర్షిత్ ప్రభు, క్రియేటివ్ ప్రొడ్యూసర్: దేవేంద్ర ఎం, అసోసియేట్ డైరెక్టర్: శృతి మైదల, క్రియేటివ్ సపోర్ట్: హేమ మనోజ్ మైదల, నిర్మాతలు: చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం, కథ, స్క్రీన్ ప్లే, దర్శకుడు: మనోజ్ కుమార్.

మిస్సింగ్ మేఘన ..ఫస్ట్ లుక్ విడుదల

రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధ్రువన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గో÷-డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.



గత సినిమాలతో గుణపాఠం నేర్చుకున్నా

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన వరుస ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన గత సినిమాల పరాజయాలపై వరుణ్ తేజ్ ఎంతో నిజాయితీగా స్పందించారు. 'మట్కా', 'ఆపరేషన్ వాలెంటైన్', 'గాండీవధారి అర్జున' వంటి చిత్రాలు ఎందుకు ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయాయో తనదైన విశ్లేషణ చేశారు. భారీ అంచనాల మధ్య విడుదలైన 'మట్కా' సినిమాపై మొదటి నుంచే ప్రేక్షకుల్లో పెద్దగా ఆసక్తి కనిపించలేదని వరుణ్ తెలిపారు. ట్రైలర్ విడుదలైన తర్వాత వచ్చిన స్పందన చూసి, తన నుంచి ప్రేక్షకులు అలాంటి సీరియస్ కథలను ఆశించడం లేదనే విషయం అర్థమైందన్నారు. సినిమాలోని కంటెంట్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే స్థాయిలో లేకపోవడం కూడా పరాజయానికి ప్రధాన కారణమని ఆయన అంగీకరించారు. రొటీన్‌కు భిన్నంగా కొత్త తరహా సినిమాలు చేయాలనే ఉద్దేశంతో 'మట్కా', 'గాండీవధారి అర్జున', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలు చేశానని వరుణ్ చెప్పారు. అయితే ఆ సినిమాలు కేవలం ఒక వర్గం ప్రేక్షకులకు మాత్రమే నచ్చాయని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయని వెల్లడించారు. ఒక సినిమా చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరూ కలిసి చూసి ఎంజాయ్ చేయగలిగేలా ఉండాలి. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే ముందుగా వినోదాన్నే ఆశిస్తారు. ఆ బేసిక్ పాయింట్‌ను నేను మిస్ అయ్యాను అని వరుణ్ తేజ్ అన్నారు. గత వైఫల్యాలు తనకు విలువైన పాఠాలు నేర్పాయని, ఇకపై వినోదానికి పెద్దపీట వేసే కథలను ఎంచుకుంటానని చెప్పారు. తన కొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు' పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని వరుణ్ తేజ్ ధీమా వ్యక్తం చేశారు.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844